PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 337 | విజయవాడ, బుధవారం 9 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 9 July 2025 | Rs

ప్రపంచానికి చక్రవర్తి అవసరం లేదు!

- ట్రంప్‌పై మండిపడ్డ లూలా డసిల్వా
- చైనా, రష్యా సహా బ్రిక్స్ దేశాల నిరసన

7



7

భారత నావికాదళంలోకి నిస్తార్





శ్రీశైలం డ్యామ్ 4 గేట్ల ద్వారా దిగువకు వదిలిన నీరు, హారతి ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

15న 'జీడిపల్లి'కి నీళ్లు

11న హంద్రీనీవా పంపులు ప్రారంభిస్తాం

- శ్రీశైలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

హంద్రీనీవా పంపులను ఈ నెల 11న ప్రారంభిస్తామని, 15వ తేదీకి జీడిపల్లికి నీళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. మంగళవారం ఆయన శ్రీశైలంలో పర్యటించారు. ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో సున్నిపెంటలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి శ్రీశైలం దేవస్థానానికి వెళ్లి శ్రీశైల భ్రమరాంబిక, మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం జలాశయం వద్దకు చేరుకొని కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. నాలుగు గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు అనంతరం సున్నిపెంటలో నిర్వహించిన ప్రజావేదిక సభలో మాట్లాడుతూ జులైలోనే శ్రీశైలం నిండుగా ఉండడం శుభపరిణామన్నారు. రాష్ట్రంలోని అన్ని జలాశయాలూ నిండాలని, సాగు, తాగునీరు, పరిశ్రమలకు నీరు పుష్కలంగా ఇచ్చే అవకాశం ఉండాలని ఆకాంక్షించారు. గత టిడిపి ప్రభుత్వంలో రూ.68 వేల కోట్లు ప్రాజెక్టులకు ఖర్చు పెట్టామని, ఇందులో రూ.12 వేల కోట్లు ఖర్చు రాయలసీమకే ఖర్చు చేశామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులకు రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందన్నారు. రూ.3,890 మిగతా 7లో

జిల్లాలోనే 'ఉచిత బస్సు'?

మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిధికే పరిమితం చేయనుందా? సున్నిపెంటలో జరిగిన ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగం అనంతరం ఈ అంశంపై చర్చ జరుగుతోంది. ఆయన తన ప్రసంగంలో 'మహిళలు జిల్లాలో ఎక్కడ తిరగాలన్నా ఆగస్టు 15 వ తేది నుండి ఉచిత బస్సు పథకం అమలు చేస్తాం' అని చెప్పారు. దీంతో ఉచిత బస్సు పథకాన్ని జిల్లా పరిధికే పరిమితం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే, అధికారులు మాత్రం సిఎం ప్రకటనపై పెదవి విప్పడం లేదు.

ట్రంప్ బెదిరింపులు

- మా సుంకాలు భరించాల్సిందే!
- మీరు స్పందిస్తే మేం మరింత పెంచుతాం
- 14 దేశాలకు లేఖలు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని తీవ్రతరం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆయన అమెరికాకు నమ్మకమైన వాణిజ్య భాగస్వాములుగా ఉన్న దేశాలను సైతం వదలడం లేదు. అమెరికా అధ్యక్షుడిగా రెండవ సారి ఎన్నికైన ఆయన అన్ని దేశాటపై సుంకాలను భారీ ఎత్తున పెంచుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన వివిధ దేశాలకు రాసిన లేఖలో తాము పెంచిన సుంకాలను భరించాల్సిందేనని, దానికి భిన్నంగా ప్రతిస్పందించి చర్యలు చేపడితే, తాముకూడా అదే స్థాయిలో స్పందించి మరింతగా సుంకాలను పెంచుతామని హెచ్చరించారు. 'మీరు ఎంత శాతాన్ని పెంచితే, దాన్ని మేం ఇప్పటికే వసూలు చేస్తున్న సుంకానికి కలిపి అదనంగా వసూలు చేస్తాం' అని ఈ లేఖలలో ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు జపాన్, దక్షిణకొరియాలకు రాసిన లేఖలను ఆయన 'ట్రూత్ సోషల్' అనే సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వీటిలో 'మీపై మేం ఇప్పటికే 25శాతం సుంకం విధించాం. దీనికి ప్రతిగా మీరు మీ సుంకాలను పెంచితే, మీరు ఎంత పెంచితే అంత మొత్తాన్ని 25శాతానికి కలిపి వసూలు చేస్తాం. మేం అదనంగా విధించే సుంకం ఆ మేరకే పరిమితమవుతుందని అనుకోవద్దు.' అని ఆయన హెచ్చరించారు. ఆగస్టు ఒకటవ తేది నుండి ఈ అధిక సుంకాలు అమలులోకి వస్తాయని ఆయన తెలిపారు. మొత్తం 14 దేశాలకు ఆయన ఈ మేరకు హెచ్చరిక నోటీసులు పంపారు. జపాన్, దక్షిణ కొరియాల తరువాత మలేసియా, కజక్‌స్థాన్, దక్షిణాఫ్రికా, మయన్మార్, లావోస్, ట్యునీషియా, బోస్నియా, హెర్జెగోవినా, ఇండోనేషియా, బంగ్లాదేశ్, సెర్బియా, కంబోడియా, థాయ్‌లాండ్ దేశాల నేతలకు లేఖలు అందాయి.

నేడు సార్వత్రిక సమ్మె

ప్రభుత్వ విధానాలపై సమర భేరి

ధర్నాలు, సభలు, సమావేశాలతో హోరెత్తనున్న భారతావని

మహాసంగ్రామంలో 30 కోట్ల మంది శ్రామికులు

న్యూఢిల్లీ : భారతావనిలో నేడు ఓ చారిత్రక, అసాధారణ నిరసన ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. దేశ చరిత్రలో జరిగిన అతి పెద్ద సమ్మెలలో ఇది ఒకటిగా నిలవబోతోంది. కార్మికులు, కర్షకులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారు, వ్యవసాయ కార్మికులుసహా యావత్ శ్రామిక శక్తి చేయి చేయీ కలిపి ప్రభుత్వ విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున వీధులలోకి రాబోతున్నారు. ప్రభుత్వ - ప్రైవేటు రంగ పారిశ్రామిక యూనిట్లు, బ్యాంకులు - బీమా సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, గిగ్ వర్కర్లు, లక్షలాది మంది ఇతర శ్రామికులు వివిధ రూపాలలో నిరసన వ్యక్తం చేయబోతున్నారు. ధర్నాలు, బహిరంగ సభలు, ప్రదర్శనలతో ఢిల్లీ పీఠాన్ని కదిలించేందుకు అన్ని వర్గాలూ సంసిద్ధమవుతున్నాయి. దేశంలోని పలు జిల్లాలలో అన్నదాతలు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి రాస్తారోకో కార్యక్రమాలు చేపట్టేందుకు ఉద్యుక్తులవుతున్నారు.

వివిధ వర్గాల పట్ల కేంద్రం, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై వ్యక్తమవుతున్న తీవ్రమైన ఆగ్రహం, అసమ్మతి సార్వత్రిక సమ్మె ద్వారా వ్యక్తం కాబోతోంది. పెరుగుతున్న నిరుద్యోగం, జీవన వ్యయం, ఎదుగూ బొదుగూ లేని ఆదాయాలతో ప్రజలు విసిగివేసారి పోయారు. కార్పొరేట్ రంగానికి పాలక పక్షాలు తాయిలాలు అందిస్తూ శ్రమ దోపిడీకి వీలుగా అపరిమిత హక్కులు కల్పిస్తున్నాయి. అదే సమయంలో బాధితులకు ఉన్న చట్టపరమైన పరిష్కారాలు, హక్కులను పరిమితం చేస్తూ నిరసనలు, అసమ్మతిని ఆంక్షలు, నిర్బంధాలతో అణచివేస్తున్నాయి. దీంతో దేశంలో తీవ్ర అసమానతలు పొడసూపాయి. సంపద, సంపాదనలో వ్యత్యాసాలు, అమానవీయ వైరుధ్యాలు కన్పిస్తున్నాయి.

కేంద్ర కార్మిక సంఘాల పిలుపునకు ఎస్‌కెఎంసహా పలు సంఘాల మద్దతు

కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు వ్యవసాయ చట్టాలపై పోరాడి తిప్పికొట్టిన వివిధ రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. నరేగా సంఘర్ష్ మోర్చా, భూమి అధికార్ ఆందోళన్, ఆహార భద్రతకు సంబంధించిన సంస్థలు, దళిత, ఆదివాసీ సంఘాలు సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు అవుతున్నాయి. సార్వత్రిక సమ్మెకు అన్ని వామపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి. కొన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా సమ్మెను సమర్ధించాయి.

నాలుగు కార్మిక కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, స్కీమ్ వర్కర్లకు నెలకు రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలని కార్మిక, కర్షక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 'అవుట్‌సోర్సింగ్, స్థిరకాల ఉపాధి, అప్రెంటీసులు, ట్రెయినీలు...ఇలా ఏ రూపంలో ఉన్నప్పటికీ పనిని తాత్కాలికంగా రద్దు చేయకూడదు. కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. నెలకు కనీస పెన్షన్‌గా రూ.9,000 అందించాలి. 'సహా పలు డిమాండ్లను నెరవేర్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు సామాజిక భద్రత కల్పించాలి. ఇంటి పనివారు, నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, స్కీమ్ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, దుకాణాలు-సంస్థలలో పని చేసే వారు, లోడింగ్-అన్ లోడింగ్ కార్మికులు, గిగ్ వర్కర్లు, సాల్ట్ పాన్ కార్మికులు, బీడీ కార్మికులు, కల్లుగీత కార్మికులు, రిక్షా కార్మికులు, ఆటో-రిక్షా-ట్యాక్సీ మిగతా 7లో

స్కూల్ వ్యాన్‌ను ఢీకొన్న ట్రైన్



- ముగ్గురు విద్యార్థులు మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు

కడలూరు : తమిళనాడులో ప్రైవేటు స్కూల్ బస్సును పాసింజర్ రైలు ఢీకొనడంతో ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... మంగళవారం ఉదయం 7.45 గంటల సమయంలో కడలూరు - అలప్పకం మధ్య ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 170 (ఇంటర్‌లాక్ లేని మేన్డ్ గేట్)ను దాటడానికి ప్రయత్నిస్తున్న ప్రైవేటు పాఠశాల కృష్ణస్వామి విద్యానికేతన్ బస్సును విల్లుపురం - మైలదుత్తురై ప్యాసింజర్ (రైలు నంబర్ 56813) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు నిమిలేష్ (12), చారుమతి (16), చెఝియాన్ (15) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చారుమతి, చెఝియాన్ అక్కాతమ్ముళ్లు. వ్యాన్ డ్రైవర్ శంకర్ (47), విశ్వేశ్వర్ (16) తీవ్రంగా గాయపడ్డారు. వీరితోపాటు పిల్లలను రక్షించడానికి సంఘటనా స్థలికి పరుగెత్తుకుంటూ వచ్చిన స్థానికుడు అన్నాదురై (55) ఓవర్ హెడ్ విద్యుత్ తీగ తెగిపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కడలూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో వ్యాన్‌లో డ్రైవర్‌తో పాటు నలుగురు విద్యార్థులే ఉండటంతో భారీ ప్రాణనష్టం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. గేటు కీపర్ పంకజ్ శర్మ నిద్రమత్తులో ఉండి, గేటు మూసివేయడంలో నిర్లక్ష్యంగా ఉండటంతో ప్రమాదం జరిగిందని వారు చెప్పారు. స్థానికులు గేట్ కీపర్‌పై దాడికి ప్రయత్నించగా, రైల్వే, రాష్ట్ర పోలీసులు రక్షించి, నిందితుడిని అరెస్టు చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారాన్ని దక్షిణ రైల్వే ప్రకటించింది. గేట్ కీపర్‌ను ఉద్యోగం నుంచి తొలగించే ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొంది. ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున అందించాలని పేర్కొన్నారు.



'అన్నదాతా..'కోతలు!

- కనీస సాగు భూమి పది సెంట్లు ఉండాలన్న నిబంధన
- గతంలో ఈ షరతు లేదు
- లక్షల్లో తిరస్కరణలు
- ఆందోళనలో పేద రైతులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

సూపర్ సిక్స్ హామీలలో ముఖ్యమైన 'అన్నదాతా సుఖీభవ' లబ్ధిదారుల కోతలకు టిడిపి కూటమి ప్రభుత్వం ఎత్తులు వేస్తోంది. స్కీం అమలుకు అధికారికంగా మార్గదర్శకాలు విడుదల చేయకుండా అంతర్గతంగా వడపోతలకు దిగింది. స్వంత భూమి కలిగిన రైతులకు కేంద్ర పథకం 'పిఎం కిసాన్'తో కలిపి అమలు చేస్తున్న 'అన్నదాతా..' లబ్ధికి అర్హత పొందాలంటే రైతుకు కనీసం పది సెంట్ల సాగు భూమి ఉండాలని కొత్త నిబంధనను ముందుకు తెచ్చింది. రెవెన్యూ రికార్డుల్లో రైతుల హక్కు భుక్తములలో పది సెంట్ల భూమి ఉండి, దానిలో పంటలు సాగు చేస్తున్నట్లుగా ధ్రువీకరణ జరిగితేనే ప్రభుత్వం అందించే ఆర్థిక సాయానికి అర్హులని చెబుతున్నారు. కొన్నేళ్లుగా పది సెంట్ల లోపు రైతులు పిఎంకిసాన్- రైతు భరోసా పొందినా కొత్త నిబంధనతో ప్రాథమిక దశలోనే 'అన్నదాతా..'కు తిరస్కరిస్తున్నారు. ఈ విధంగా తిరస్కరణకు గురవుతున్న పేద రైతులు రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. తిరస్కరణకు గురైన పేద రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఇప్పటి దాకా లేదు

పిఎంకిసాన్ స్కీం 2018లో మొదలుకాగా అప్పటి నుంచి రైతులకు కనీస సాగు భూమి ఉండాలన్న నిబంధన లేదు. 2020లో కేంద్ర ప్రభుత్వం తాజా పర్చిన మార్గదర్శకాల్లోనూ కనీస సాగు భూమి ప్రస్తావన లేదు. పిఎంకిసాన్‌తో కలిపి వైసిపి ప్రభుత్వం గడచిన ఐదేళ్లు అమలు చేసిన 'రైతు భరోసా'లోనూ కనీస సాగు విస్తీర్ణం షరతు లేదు. భూమి సైజుతో సంబంధం లేదని 2019 సెప్టెంబర్ 19న అప్పటి ప్రభుత్వం జారీ చేసిన గైడ్‌లైన్స్ జిఒ 96లో పేర్కొంది. కౌలు రైతులకు షరతులు విధించింది. భూమి లేని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు కనీసం ఒక ఎకరంలో వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ పంటల సాగుకు కౌలుకు తీసుకోవాలని, పూలు, కూరగాయలైతే అరెకరం, తమలపాకులైతే కనీస విస్తీర్ణం పది సెంట్లుగా నిర్ణయించింది. స్వంత భూమి కలిగిన వారికి ల్యాండ్ సైజుతో నిమిత్తం లేకుండా 'భరోసా' ఇచ్చి, కౌలు రైతుల దగ్గకొచ్చేసరికి కనీస భూమి సైజు షరతు పెట్టడంపై అప్పట్లో కౌలు రైతుల నుంచి ఆందోళనలొచ్చాయి. కాగా రైతులందరికీ ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామన్న టిడిపి కూటమి ప్రభుత్వం కొత్తగా కనీస సాగు భూమి నిబంధనను తెరమీదికి తెచ్చింది. పది సెంట్లన్నా లేకుండా వ్యవసాయం ఏం జరుగుతుందన్న లాజిక్‌ను ప్రయోగిస్తోంది. పేద రైతు కుటుంబాలు అరెకరా ఎకరాను పంచుకుంటే పది సెంట్ల లోపు భూమి వాటాగా వచ్చిన వారనేక మంది. పది సెంట్ల లోపు విస్తీర్ణంలో పంటలేసి బతుకు సాగించే వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. లక్షల్లో ఉన్న ఇటువంటి వారిని కూటమి సర్కారు రైతులుగా గుర్తించ నిరాకరిస్తోంది.

పిఎంకిసాన్‌పైనా సందేహాలు

కూటమి సర్కారు తొలేడాది 2024-25లో 'అన్నదాతా..'ను అమలు చేయలేదు. ఆ సంవత్సరంలో పిఎంకిసాన్ మూడు కిస్తులు పది సెంట్ల లోపు రైతులకు పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వమే లబ్ధిదారుల జాబితాలు రూపొందించాల్సి ఉన్నందున ఇక నుంచి పిఎంకిసాన్ కిస్తులన్నా పడతాయా లేదా అన్న ఆందోళన పేద రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాతా.. సుఖీభవ అర్హుల జాబితా

- వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్నదాతా ..సుఖీభవ పథకం అర్హుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. అర్హుల జాబితాల్లో పేర్లు లేని రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో అర్జీని, సంబంధిత ధృవీకరణ పత్రాలు అందజేయాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హుల జాబితాలను రైతు సేవా కేంద్రాలతోపాటు, అన్నదాత సుఖీభవ పోర్టల్ https://annadathasukhibhava.ap.gov.in/know-your-statusలోను, మనమిత్ర వాట్సాప్‌లో ఆధార్ నంబర్ వివరాలు అందించి రైతుల అర్హతను తెలుసుకోవచ్చని వెల్లడించారు. మన మిత్రా వాట్సాప్ నంబరు 95523 00009కు ఆధార్ వివరాలు పంపాలన్నారు. జాబితాలో పేరు లేని రైతులు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోని గ్రీవెన్స్ మాడ్యూల్‌లోనూ ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకూ మాత్రమే గ్రీవెన్స్‌ను స్వీకరించడం జరుగుతుందన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

- సర్దుబాటు ఛార్జీల భారం ఉపసంహరించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, 2024-25 విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారం రూ.842 కోట్లు ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మరోసారి 2024-25 వినియోగంపై రూ.842 కోట్లు సర్దుబాటు ఛార్జీలను మోపుతోందని ఆయన పేర్కొన్నారు. దీనికోసం సదరన్, సెంట్రల్ పంపిణీ సంస్థలు చేసిన తాజా ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 2024 ఏప్రిల్ నుండి యూనిట్‌కు 40 పైసలు చొప్పున అదనంగా వసూలు చేసిన ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.2,787 కోట్లను వినియోగదారులకు తిరిగి చెల్లించాలని కోరారు. తప్పుడు లెక్కలు ఇచ్చి అదనపు ఛార్జీలు వసూలు చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరిగిన కరెంటు బిల్లుతో నానా అవస్థలు పడుతున్న వినియోగదారులపై రూ.842 కోట్లు సర్దుబాటు ఛార్జీల భారం పడే ప్రతిపాదన చేయడం దుర్మార్గమని వివరించారు. అదనపు వ్యయానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ప్రజలకు జవాబు చెప్పాలని తాజా సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనలను ఉపసంహరించుకుంటూ నియంత్రణ మండలికి ప్రభుత్వం లేఖ రాయాలని, ప్రజలపై భారం వేయొద్దని డిమాండు చేశారు. అధిక రేట్లకు బడా కంపెనీల నుండి విద్యుత్ కొనుగోలు చేయకుండా, వ్యయం తగ్గిస్తామని తద్వారా ఛార్జీలూ తగ్గిస్తామని కూటమి ప్రభుత్వం నమ్మబలికిందని పేర్కొన్నారు. కానీ దానికి భిన్నంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంచనాలకు మించి రూ.3,586 కోట్లు వ్యయం చేసిందని, ఆ మొత్తానికి ప్రజలపై ఇంధన సర్దుబాటు ఛార్జీల (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో భారం మోపుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు తాజాగా నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపాయని, వాటిని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఏపిఈఆర్‌సి) ప్రకటించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తరువాత ప్రతి నెలా ప్రతి వినియోగదారుడు నుండి యూనిట్‌కు 40 పైసలు సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నారని వివరించారు. ఇవే కాకుండా పాత ప్రభుత్వ హయాంలో మూడు రకాల ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీల రూపంలో 15,485 కోట్ల రూపాయలు ఈ ప్రభుత్వం వచ్చాక అదనపు భారం మోపిందని వివరించారు. బడా కంపెనీలతో అవినీతికర తప్పుడు ఒప్పందాలను కొనసాగిస్తూ, అధిక రేట్లతో బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తూ వ్యయం పెంచారని వివరించారు. దాన్ని సర్దుబాటు ఛార్జీల రూపంలో వినియోగదారులపై వేయటం గర్హనీయమని పేర్కొన్నారు. కార్పొరేట్లకు మేలు చేయడం కొరకు వినియోగదారులపై ఈ రూపంలో భారం వేయడం తగదని వివరించారు. ప్రతిపాదిత రూ.842 కోట్లును ప్రభుత్వమే భరించాలని కోరారు. తూర్పు పంపిణీ సంస్థలో రూ.1,226 కోట్లు మిగులు ఏర్పడినందున వాటిని ట్రూడౌన్ ద్వారా ఛార్జీలు తగ్గించి వినియోగదారుల బిల్లుల్లో సర్దుబాటు చేయాలని, యూనిట్‌కు 40 పైసలు వసూలు చేస్తున్న విధానాన్ని ఆగష్టు ఒకటి నుండి నిలిపేయాలని కోరారు.

గోదావరి ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

- 10, 11 తేదీల్లో నిర్వాసిత గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటన


2

పోలీసు స్టేషన్లలో సిసి కెమెరాలపై హైకోర్టు సందేహం

- నివేదిక కోసం అడ్వకేట్స్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని ఆయా డిఎస్‌పిలు హైకోర్టుకు నివేదికలు సమర్పించారు. అయితే పోలీస్ స్టేషన్ లోపల, బయట కనబడేలా వాటిని ఏర్పాటు చేశామన్న నివేదికలపై హైకోర్టు సందేహాలను లేవనెత్తింది. సిసి కెమెరాల ఏర్పాటుపై నిగ్గు తేల్చేందుకు అడ్వకేట్స్ కమిటీ వేస్తామని స్పష్టం చేసింది. పోలీసులు ఇచ్చిన నివేదికకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకూ పొంతన లేదని వ్యాఖ్యానించింది. విజయవాడ సైబర్ క్రైమ్ పిఎస్సే నిదర్శనమని చెప్పింది. చాలా పిఎస్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు ఎందుకు చేయలేదో చెప్పాలంది. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అన్నీ కనిపించేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని విజయవాడ అసిస్టెంట్ కమిషనర్ నివేదిక ఇచ్చారని, ఇక్కడికి చెందిన మరో కేసులో సంబంధిత మెజిస్ట్రేట్ మాత్రం కేవలం ఒక్క సిసి కెమెరా ఉందని తమకు నివేదిక ఇచ్చారని చెప్పింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు అన్ని పిఎస్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ న్యాయవాది తాండవ మిగతా 7లో



వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న జగన్

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

తల్లితో కలిసి ఘాట్ వద్ద వేర్వేరుగా నివాళులర్పించిన జగన్, షర్మిల

ప్రజాశక్తి- వేంపల్లె (వైఎస్ఆర్ కడప జిల్లా)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలు మంగళవారం వైఎస్ఆర్ కడప జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వేంపల్లె మండలం ఇడుపులపాయలోని వైఎస్ఆర్ సమాధి వద్ద తల్లి విజయమ్మ, భార్య వైఎస్.భారతి, ఇతర కటుంబ సభ్యులతో కలిసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల వేర్వేరుగా నివాళులర్పించారు. అక్కడే ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్ ఘాట్ వద్దకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సతీమణి విజయమ్మ చేరుకున్నారు. జగన్ రాక ముందే తన భర్త సమాధి వద్ద ఆమె నివాళులర్పించారు. అనంతరం భారతి రాగానే గతంలో మాదిరి జగన్ కోసం వేచి ఉండకుండా చర్చి ఫాస్టర్ ప్రార్ధనలు ప్రారంభిం చారు. ప్రార్ధనలు జరుగుతుండగా ఉదయం 7.50 గంటలకు వైఎస్ఆర్ ఘాట్ వద్దకు కడప ఎంపి అవినాష్‌రెడ్డితో కలిసి జగన్ విచ్చేశారు. అరగంట మిగతా 7లో

వ్యవసాయ నీటి సంపులో పడి ఇద్దరు వలస కార్మికులు మృతి

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం రూరల్

జీవనోపాధి కోసం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణానికి వచ్చిన రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వలస కార్మికులు నీటి సంపులో పడి మృత్యువాత పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన దాదాపు 30 మంది వలస కార్మికులు నెలరోజుల క్రితం కళ్యాణదుర్గానికి వచ్చారు. ఇక్కడే భవన నిర్మాణ కార్మికులుగా పనులు చేస్తున్నారు. మంగళవారం పనులు లేకపోవడంతో జుట్టూ ఆలియాస్ జ్వాలా రాము (22), భగత్‌సింగ్ (25)తో పాటు మరో యువకుడు కళ్యాణదుర్గం మండలం పాపంపల్లిలోని రైతు వెంకటేష్‌బాబు వ్యవసాయ తోటలోకి వెళ్లారు. చేతికి అంటుకున్న మరకలను కడుక్కోవడానికి పక్కనే ఉన్న వ్యవసాయ నీటి సంపు దగ్గరికి వెళ్లారు. సంపు చుట్టూ టార్పాలిన్ పరిచి ఉండటంతో కాలుజారి జ్వాలా రాము నీటి సంపులో పడిపోయారు. అతడిని రక్షించే క్రమంలో భగత్‌సింగ్ కూడా సంపులో పడిపోయారు. ఈత రాకపోవడం, సంపు లోతుగా ఉండడంతో ఊపిరాడక, బయటకు రాలేక ఇద్దరూ మరణించారు. తోట యజమానికి వీరి వెంట వచ్చిన కార్మికుడు సమాచారం అందివ్వగా ఆయన కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా శాకాంబరీ ఉత్సవాలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విజయవాడ ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శాకాంబరీ ఉత్సవాలు వైభవంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల ఎనిమిది నుంచి 10వ తేదీ వరకు మూడ్రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 2007 నుంచి దుర్గమ్మ సన్నిధిలో శాకాంబరీ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్రంలో నలుమూలల నుంచి వచ్చిన యాత్రికులు అమ్మవారికి వివిధ కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు సమర్పించారు. మల్లికార్జున మహా మండపంలో ఆరో అంతస్తు ప్రాంగణంలో ప్రత్యేక వేదికపైన అమ్మవారిని వివిధ శాకలతో సుందరంగా అలంకరించి యాత్రికులకు దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు ఉపాలయాలను కూరగాయలు, పండ్లతో రమణీయంగా అలంకరించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శాకాంబరి ఉత్సవ ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణ అధికారి వికె శీనా నాయక్ దగ్గరుండి పర్యవేక్షించారు.

పథకాల అమలులో బాలారిష్టాలను తొలగిస్తాం

- మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో బాలరిష్టాలు ఉన్నాయని, వీటిని తొలగించడానికి కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, ఉచితంగా మూడు సిలిండర్లు ఇచ్చే విషయంలో అనర్హులుగా పరిగణించబడిన వారికి తగిన కారణం చెప్పేలా అధికారులకు కూడా సమాచారం రావడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గత ప్రభుత్వంలో సచివాలయాల్లో రూపొందించిన డేటాను యథాతథంగా ఆమోదించడం, అవే నిబంధనలు కొనసాగించడం వల్ల పలువురికి నష్టం జరిగిందన్న విషయాన్ని కూడా మంత్రి వర్గంలో చర్చిస్తామన్నారు. కుటుంబ హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఉండటం వల్ల కొంతమందికి పథకాలు అందడం లేదని పలువురు ఎమ్మెల్యేలు ఆయన దృష్టికి తీసుకురాగా, ఈ విషయాన్ని మంత్రి వర్గంలో చర్చిస్తామని, హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో సవరణకు ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

పోలవరం నుంచి 2,02,463 క్యూసెక్కులు విడుదల

ప్రజాశక్తి - యంత్రాంగం

పోలవరంలో గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలు, గోదావరి ఉపనదుల వరద నీరు గోదావరిలో కలుస్తుండడంతో నీటిమట్టం పెరిగింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 19.60 అడుగులకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 2,02,463 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల మధ్య 15.680 మీటర్ల నీటిమట్టం నమోదైంది. స్పిల్‌వేలోకి వస్తున్న అదనపు జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువన 6.43 మీటర్లు నీటిమట్టం నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నిలకడగా ఉందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. సోమవారం భద్రాచలంలో 18.6 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం మంగళవారం 19.09 అడుగులకు చేరుకుంది. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలకు అవకాశమున్నందున గోదావరి, శబరికి మళ్లీ వరద పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మంగళవారం పాడేరులోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎటపాక, కూనవరం, చింతూరు, విఆర్.పురం ప్రాంతాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలను తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.



స్పిలే వే నుంచి విడుదలవుతున్న గోదావరి జలాలు

గోదావరి ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

- వి.శ్రీనివాసరావు డిమాండ్
- 10, 11 తేదీల్లో నిర్వాసిత గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోదావరి వరద పెరుగుతోందంటూ భారత వాతావరణ శాఖ (ఐఎండి) చేసిన ముందస్తు సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు తక్షణం రక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూనవరం, చింతూరు మండలాల్లో ప్రజలను జాగృతం చేసి వరదకు గురవుతున్న గ్రామాలను తక్షణమే వరద సహాయక శిబిరాలకు ప్రభుత్వమే వాహనాలు ఏర్పాటు చేసి తరలించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో సహాయక శిబిరాలు ఏర్పాటు చేయాలని, వారికి భోజన, వైద్య సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వరద వచ్చిన తరువాత తరలించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం వరదరాక ముందే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు లేనిచోట ప్రభుత్వమే టార్పాలిన్స్ పంపిణీ చేసి సురక్షిత ప్రదేశాలకు పంపాలని, బియ్యం, కందిపప్పు, మంచి నూనె, కిరోసిన్, ఉల్లిపాయలు, పంచదార, గోధుమపిండి నిత్యావసరాలు పంపిణీ చేసి వారిని ఆదుకోవాలని తెలిపారు. పోలవరానికి కేటాయించిన నిధుల్లో నిర్వాసితుల పరిహారానికి మొదట ప్రాధాన్యత ఇచ్చి, ప్రతి సంవత్సరం వచ్చే వరదల బారిన పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని శ్రీనివాసరావు కోరారు. అత్యంత కీలకమైన పునరావాస పనులు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికి కాంట్రాక్టర్లకు రెండు, మూడుసార్లు అంచనాలు పెంచారని, డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారకులైన కాంట్రాక్టర్లకు అదనంగా డబ్బు శాంక్షన్ చేశారని, నిర్వాసితులకు మాత్రం న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు.

10, 11 తేదీల్లో ముంపు ప్రాంతాల్లో పర్యటన

ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ముంపునకు గురవుతున్న ప్రాంతాల్లో ఈ నెల 10,11 తేదీల్లో సిపిఎం రాష్ట్ర బృందం పర్యటించనుంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం, జిల్లా కార్యదర్శులు ఎ.రవి, బి.కిరణ్ బృందంలో ఉంటారు.

సార్వత్రిక సమ్మెకు కెవిపిఎస్ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ మద్దతు తెలిపింది. సమ్మెను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మతోన్మాద మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు.

డిసిహెచ్‌ఎస్‌లు పనితీరు మారాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా ఆరోగ్య సేవల సమన్వయాధికారులు (డిసిహెచ్ఎస్) పనితీరులో మార్పు రావాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. డిసిహెచ్ఎస్‌లకు 4 రోజుల రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అదే విధంగా సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ రూపొందించిన సమగ్ర యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సమయపాలన పాటించని వైద్యుల విషయంలో ఉపేక్షించేది లేదన్నారు. సెకెండరీ ఆస్పత్రుల్లో సిజేరియన్లను తగ్గించి, సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 90 శాతం ఆస్పత్రుల్లో అల్ట్రా సోనోగ్రఫీ (యుఎస్‌సి) సర్వీసుల్ని కల్పించామని, 149 ఎక్స్‌రే యంత్రాల్ని ఏర్పాటు చేశామని, 89 ఆస్పత్రుల్లో టెలిరేడియాలజీ సర్వీసుల్ని కల్పించామని, 20 కొత్త డయాలసిస్ సెంటర్లు నెలకొల్పామని మంత్రి తెలిపారు. 61 నుంచి 40 శాతానికి అవినీతి తగ్గిందని ఐవిఆర్ఎస్ సర్వేలో తేలిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సెకెండరీ హెల్త్ డైరెక్టర్ ఎ సిరి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కరేడును కార్పొ'రేట్ల'కు అప్పగిస్తారా?

ఒక్క కంపెనీ కోసం 20 వేలమందిని అనాథలను చేస్తారా!

విశాల ప్రజా ఉద్యమం నిర్మిస్తాం : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ప్రశాంతతకు మారుపేరు, సిరులకు నిలయమైన కరేడు గ్రామాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనికి వ్యతిరేకంగా రైతులు, ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి విశాల ప్రజా ఉద్యమ నిర్మిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. కరేడు భూసేకరణ వ్యతిరేక ఉద్యమం, తదితర పరిణామాలను పరిశీలించడానికి మంగళవారం ఆయన కందుకూరులో పర్యటించారు. ముఖ్యనాయకులతో మాట్లాడారు. అనంతరం మీడియా సమావేశంలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయన్నారు. బలవంతపు భూసేకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక కంపెనీ కోసం 20 వేల మంది జీవితాలను ఫణంగా పెట్టడం ఏ మాత్రమూ ఆమోదయోగ్యం కాదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళారులుగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. కరేడు పంచాయతీలోని అన్ని సామాజిక తరగతుల ప్రజలూ బలవంతపు భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తుంటే, ప్రభుత్వం స్పందించదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికే సేకరించి, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కంపెనీలకు ఇవ్వాలన్నారు. ప్రజలు జీవనోపాధి పొందుతున్న పచ్చని పంట పొలాలను ప్రభుత్వం లాగేసుకుంటే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని కరేడుకు చెందిన రెండు వేల మందికిపైగా రైతులు రోడ్డెక్కి ఉద్యమం చేసినప్పటికీ ప్రభుత్వ స్పందించకపోవడం దారుణమన్నారు. ఏటా రెండు, మూడు పంటలు పండే కరేడులాంటి గ్రామాల్లో భూసేకరణ వద్దని గ్రామ రైతులు ఏకగ్రీవంగా తీర్మానించడాన్ని ఆయన ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. కరేడులో పూర్తిగా వ్యవసాయ, ఉద్యానవన పంటలపై ఆధారపడి జీవించే నిరుపేద రైతులే అధికంగా ఉన్నారని తెలిపారు. వారి ఉద్యమానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. గతంలో రైతుల నుంచి బలవంతంగా సేకరించిన రెండున్నర లక్షల ఎకరాల్లో ఎన్ని పరిశ్రమలు పెట్టారో, ఎంతమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆ రెండున్నర లక్షల ఎకరాల భూములూ ఖాళీగానే ఉన్నాయని, ఉపాధి పేరుతో ప్రభుత్వం యువతలో భ్రమలు సృష్టిస్తోందని వివరించారు. దేశంలోని యువతకు ఉపాధి లేకపోవడంతో మానవాభివృద్ధిలో మన దేశం పదో స్థానానికి పడిపోయిందని గుర్తు చేశారు. అభివృద్ధి అంటే ఇదేనా? అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఇండోసోల్ సోలార్‌కు రూ.1,800 కోట్లు, ఇండోసోల్ సోలార్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు రూ.5,180 కోట్లు రాయితీ ఇస్తోందన్నారు. తొలివిడతగా రూ.1800 కోట్ల ప్రజల సొమ్మును ప్రాజెక్టు నిర్మాణానికి దోచిపెడుతోందని తెలిపారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె అజయ్‌కుమార్, గుడ్లూరు, ఉలవపాడు, కందుకూరు ప్రాంతీయ కమిటీల సిపిఎం కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, జివిబి కుమార్, ఎస్ఎ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు

బుధవారం జరగనున్న జాతీయ సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని వి.శ్రీనివాసరావు తెలిపారు. కార్మికుల సమ్మె న్యాయమైందన్నారు. లేబర్ కోడ్లను కార్మికులపై ప్రభుత్వం రుద్దిందన్నారు. కార్మికులకు 13 సంవత్సరాల నుంచి కనీస వేతనం, ఉద్యోగం భద్రత లేకుండా చేసిందని, జీతాలు పెంచడం లేదని వివరించారు. రాష్ట్రంలో చిన్నచిన్న కార్మికులు తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్నారని, సమ్మె ప్రకటన చేసినా ప్రభుత్వం కనీసం చర్చకు పిలవలేదని, దీన్నిబట్టి ప్రభుత్వం ఎవరి పక్షాన ఉందో అర్థమవుతోందని తెలిపారు.

పోటాపోటీ ఫిర్యాదులు

- ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి : ప్రశాంతిరెడ్డి
- నన్ను హత్య చేయించడానికి కుట్ర : ప్రసన్నకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి/ అమరావతి బ్యూరో

ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, తనను హత్య చేయించడానికి కుట్రపన్నారని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పోటాపోటీగా పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక తనను అసభ్య పదజాలంతో ప్రసన్న కుమార్‌రెడ్డి ధూషించారని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అడిషనల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్యకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన గ్రావెల్ దోపిడీ, అవినీతి అక్రమాల గురించి మాట్లాడుతుంటే సభ్యసమాజం తలదించుకునేలా నోరుపారేసుకున్న ఆయనను మహిళా సమాజం క్షమించదన్నారు. తమ వ్యక్తిగత జీవితాన్ని, భర్తను కించపరిచేలా మాట్లాడారని, సంస్కార రహితంగా మాట్లాడిన ప్రసన్నను చట్టపరంగా ఎదుర్కొంటానని తెలిపారు. ఆయన ఇంటిపై జరిగిన దాడిలో తనకు గాని, తన భర్తకు గాని ఎలాంటి సంబంధమూ లేదన్నారు. ఆ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఎవరో చేసిన తప్పులను తమపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తనను హత్య చేయించడానికి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పథకం వేశారని ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొద్దిరోజులుగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, పర్సంటేజీల ప్రసన్న అంటూ హేళన చేస్తున్నారంటూ వివరించారు. తాను చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని తెలిపారు. గుండాలు, రౌడీలకు మందుపోయించి తన ఇంటిపైకి దాడికి ఉసిగొల్పారని, ఒకవేళ నేను ఇంట్లో ఉంటే హత్య చేసేందుకు సిద్ధమై వచ్చారని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ప్రసన్నకు ఎంపి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు మద్దతుగా నిలిచారు.

నల్లపరెడ్డి వ్యాఖ్యలు అభ్యంతరకరం డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం, మహిళలను కించపరచడాన్ని ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలన్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించినా, అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసినా చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు.

చట్టపరమైన చర్యలు : మహిళా కమిషన్

ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఆ మాటలు మహిళా లోకాన్ని కించపరిచేలా, సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఉండే మహిళను అవమానించేలా, వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడటం హేయమన్నారు.

రాజకీయాలు హుందాగా ఉండాలి

'కోవూరు' పరిణామాలపై సిపిఎం ఖండన

రాజకీయాల్లో నాయకులు హుందాగా ఉండాలని, నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు దిగజారిపోతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. కోవూరులో చేటుచేసుకున్న వరుస సంఘటలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మహిళా ప్రజాప్రతినిధిపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సభ్య సమాజం క్షమించదన్నారు. ఇళ్లపై దాడుల చేయడం సంప్రదాయం కాదని తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఇలాంటి రాజకీయాలు ఎప్పుడూ చూడలేదని, భవిష్యత్తు రాజకీయాలకు ఇది చెరగని మచ్చలా ఉంటుందని పేర్కొన్నారు.

నల్లపరెడ్డి భేషరుతుగా క్షమాపణలు చెప్పాలి : ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భేషరుతుగా క్షమాపణలు చెప్పాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బహిరంగంగా స్త్రీల వ్యక్తిత్వంపై రాజకీయ నాయకులుగా ఉండి లైంగిక వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం అంగీకారయోగ్యం కాదన్నారు. ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారిని చట్టసభలకు అనర్హులుగా చట్టం చేయాలన్నారు. ఇలాంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

పి-4తో పేదలను ఆర్థికంగా బలోపేతం చేయాలి : సురేష్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పి-4 పథకం అమలు ద్వారా పట్టణ ప్రాంతాల్లో ఉన్న 20 శాతం అతిపేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని, దీనికి మెప్మా కృషి చేయాలని పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. మెప్మా ఎగ్జిక్యూటివ్ కమిటీ 15వ సమావేశం మంగళవారం మెప్మా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి-4 పథకం సక్రమంగా అమలయ్యేందుకు మెప్మా సిబ్బంది కృషి కూడా ఎంతో ఉందని సూచించారు. ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని వివరించారు.

పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?

- రాజధానిలో భూములు పొందిన సంస్థలకు సిఎం ప్రశ్న

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు, ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని పరిధిలో భూములు పొందిన సంస్థలను ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం సిఎం క్యాంపు కార్యాలయంలో సిఆర్‌డిఏపైనా, అభివృద్ధి పనులపైనా సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భూములు పొందిన సంస్థల ప్రతినిధులు, వివిధ అభివృద్ధి పనులు చేయాల్సిన కాంట్రాక్టర్లు హాజరయ్యారు. వారి నుద్దేశించి సిఎం మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలో నిర్మాణాలు మొదలుపెట్టి పూర్తి చేయాలని సూచించారు. భూములు పొందిన సంస్థలకు అవసరమైన అనుమతులను ఇచ్చే విషయంలో ఎక్కడా జాప్యం చేయవద్దని, అవసరమైతే తనను నేరుగా సంప్రదించాలని అధికారులకు చెప్పారు. రాజధానిలో వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, హోటళ్లు, కార్యాలయాలు, వివిధ ప్రాజెక్టుల కోసం కేటాయించిన స్థలాల్లో ప్రస్తుత పరిస్థితిపైనా ఈ సమావేశంలో చర్చించారు. ఇప్పటి వరకూ రాజధానిలో 886 ఎకరాలు వేర్వేరు సంస్థకు ు కేటాయించారు. మరో 11 సంస్థలకు 61.49 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. దీనికి క్యాబినెట్లో ఆమోదం పొందాల్సి ఉంది. సిఎం చర్చించిన అనంతరం నెలలో నిర్మాణాలు ప్రారంభిస్తామని మూడు సంస్థల ప్రతినిధులు తెలిపారు. 15 సంస్థలు రెండు నెలల్లో ప్రారంభిస్తామని, 13 సంస్థలు ఐదు నెలల్లో పనులు చేపడతామని వాటి ప్రతినిధులు హామీ ఇచ్చారు. 17 సంస్థల ప్రతినిధులు ఆరునెలల్లో పనుల చేపడతామన్నారు. ప్రతి కంపెనీ, సంస్థ ప్రతినిధుల నుండి వారి ప్రణాళికతోపాటు స్పష్టమైన హామీని తీసుకున్నారు. తమకు అదనంగా మరికొంత భూమిని కేటాయించాలని పలు సంస్థల ప్రతినిధులు సిఎంను కోరారు. 11 ఏళ్లయినా రాజధాని అమరావతిలో రైతులకు ప్లాట్లు ఇవ్వలేదంటూ ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్త గురించి కూడా ముఖ్యమంత్రి మాట్లాడినట్లు సమాచారం.

ఎన్‌టిఆర్ విగ్రహంపై మంత్రి నారాయణ సమీక్ష

రాజధాని పరిధిలోని నీరుకొండ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఎన్‌టిఆర్ విగ్రహం, చుట్టుపక్కల నిర్మించే భవనాలపై మంత్రి నారాయణ మంగళవారం సమీక్ష నిర్వహించారు. మొదటిదశలో ఎన్‌టిఆర్ విగ్రహంతోపాటు ఎన్‌టిఆర్ మ్యూజియం ఏర్పాటు చేయనున్నారు. విగ్రహ నమూనాపై షెలాడియా కంపెనీ ప్రతినిధులు మంత్రికి పలు ప్రతిపాదనలు వివరించారు. కనీసం 10 నమూనాలు సిద్ధం చేయాలని మంత్రి వారికి సూచించారు. నమూనాలపై టిడిపి నేత టిడి జనార్ధన్ సలహాలు తీసుకోవాలని మంత్రి సూచించారు.



ఆర్లి సచివాలయం వద్ద ఆందోళన చేపడుతున్న రైతులు

వ్యవసాయ భూములను సెజ్‌లకు ఇచ్చేది లేదు

- సచివాలయం ఎదుట ఆర్లి గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - కె.కోటపాడు (అనకాపల్లి)

వ్యవసాయ యోగ్యమైన భూములను సెజ్‌లకు ఇచ్చేది లేదని అనకాపల్లి జిల్లా కె. కోటపాడు మండలం ఆర్లి గ్రామానికి చెందిన రైతులు తెగేసి చెప్పారు. తమకు తెలియకుండా రెవెన్యూ అధికారులు ఎలా సర్వే నిర్వహిస్తారని ప్రశ్నించారు. సెజ్‌లకు భూములు తీసుకుంటామంటూ అధికారులు రహస్య సర్వేలు చేయడాన్ని తప్పుబడుతూ స్థానిక సచివాలయం ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, ఎపి రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గండి నాయన బాబు, గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి ప్రాంతాల్లో ఎస్ఇజెడ్‌లకు భూ కేటాయింపులు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎస్ఇజెడ్ నిర్మాణానికి కావాల్సిన 1012 ఎకరాల భూమి పై ప్రాంతాల్లో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి కేటాయింపులకు ప్రయత్నిస్తోందని తెలిపారు. 602 మంది రైతుల నుంచి 700 ఎకరాల డి ఫారం మెట్టు భూములు, అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్ (గ్రీన్ బెల్ట్) మొక్కల పెంపకం కోసం కేటాయించిన 300 ఎకరాలను ఎస్ఇజెడ్‌కు కేటాయించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎస్ఇజెడ్‌లకు స్థల కేటాయింపులు ఏ జోన్ కిందకు వస్తాయో ముందుగా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అచ్యుతాపురం ఏరియాలో 9,500, పరవాడ ప్రాంతంలో 2500 ఎకరాల భూములు ఎస్ఇజెడ్‌లకు కేటాయించారని, అక్కడ పూర్తిస్థాయిలో కంపెనీల నిర్మాణం జరగలేదని వివరించారు. ప్రశాంతమైన ప్రాంతాన్ని కాలుష్య, ప్రమాదపూరిత ప్రాంతంగా మార్చొద్దన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆర్ఎ.పాత్రుడు, రుత్తల గోవింద్, బోళం కాసుబాబు, ములగపాక సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండగ చేసిన వైఎస్ఆర్

- జయంతి సభలో ఎంపిలు అయోధ్యరామిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయాన్ని పండగ చేసి చూపించిన విజనరీ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని వైసిపి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమం మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పలువురు కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపి వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర్‌రెడ్డి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన చనిపోయి 15 ఏళ్లు గడిచినా తెలుగు రాష్ట్రాల్లో రైతులు ఇప్పటికీ ఆయన్ను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారని పేర్కొన్నారు. ఉచిత వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఇప్పుడు అన్ని రాష్ట్రాల్లోనూ అమలవుతున్నాయని వివరించారు. ఎంపి అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో క్రమశిక్షణ కలిగిన నాయకుడు వైఎస్ఆర్ అని అన్నారు. ఆయన జీవితం నుండి ఎంతో నేర్చుకోవాలని తెలిపారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, జోగి రమేష్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ అంటే వైఎస్ఆర్ గుర్తుకు వస్తారన్నారు. మాజీ ఎంపి నందిగం సురేష్ మాట్లాడుతూ.. రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన సంక్షేమ పథకాలను ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మరో దశకు తీసుకెళ్లారని పేర్నొన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ఆయన చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశంలో రోల్‌మోడల్ అయ్యాయని వివరించారు.

పురుషోత్తపట్నంలో భూముల వివాదం

- గ్రామస్తులకు, ఆలయ అధికారులకు మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి - ఎటపాక (అల్లూరి జిల్లా)

కొంతకాలంగా కొనసాగుతున్న పురుషోత్తపట్నం భూముల వివాదం మళ్లీ రాజుకుంది. భద్రాచలం శ్రీసీతారామచంద్ర దేవస్థానం భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకంటూ మంగళవారం దేవస్థానం సిబ్బంది పురుషోత్తపట్నం వెళ్లారు. విషయం తెలిసి అదే ప్రాంతంలో కొద్దికాలంగా ఉంటున్న వారు అక్కడకు చేరుకున్నారు. భూముల విషయమై వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో తోపులాట జరిగింది. దేవస్థానం ఇఒ రమాదేవి స్పృహ తప్పి పడిపోయారు. స్థానికులు ఆమెను భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్ర దేవస్థానానికి పురుషోత్తపట్నంలో 890 ఎకరాల భూములు ఉన్నాయని, వాటిని కొంతకాలంగా స్థానికులు సాగు చేసుకుంటూ, నివాసం ఉంటున్నారని దేవస్థానం అధికారులు చెబుతున్నారు. ఆక్రమణలు తొలగించడానికి వెళ్లిన వారిపై దాడికి పాల్పడ్డారని అంటున్నారు. ఆ భూములు తమ పూర్వీకుల నుంచి తమకు వచ్చాయని, ఆధారాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. చాలా కాలంగా నడుస్తున్న ఈ సమస్య కోర్టు పరిధిలోనూ ఉంది. పురుషోత్తపట్నంలో భద్రాచలం ఆలయ భూముల్లో ఆక్రమణలను తొలగించి సమస్యను పరిష్కరించాలని సిఎం చంద్రబాబును తెలంగాణ మంత్రి కొండా సురేఖ కోరారు.

వైసిపిపై దేశద్రోహం కేసు పెట్టాలి

- ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేలా వైసిపి చేసిన తప్పుడు ప్రచారానికి, రాద్ధాంతానికి దేశ ద్రోహం కేసు పెట్టాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపి బ్రాండ్‌ను దెబ్బతీసేందుకు మాజీ సిఎం జగన్ కుట్రలు చేస్తున్నారని, రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందంటూ గగ్గోలు పెడుతున్నారని అన్నారు. ప్రజలు తమకు ఓటు వేయలేదనే అక్కసుతో ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని అడ్డుకునేందుకు పరోక్షంగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది మార్చిలో ఎపిఎమ్‌డిసి ద్వారా రూ.9 వేల కోట్ల రుణాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే రాకుండా అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారన్నారు. జర్మనీలో పనిచేస్తున్న విప్రో ఉద్యోగి ఉదయ భాస్కర్ అనే వ్యక్తితో బాంబే మార్కెట్లోని పెట్టుబడిదారులందరికీ పెట్టుబడులు పెట్టొద్దని మెయిల్స్ పంపించారని తెలిపారు. వైసిపికి చెందిన రాజ్యసభ సభ్యులు, ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యులతో కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐ, సెబీకి ఫిర్యాదులు చేయించినట్లు చెప్పారు. ఆ పార్టీ నాయకులు లేళ్ల అప్పిరెడ్డితో హైకోర్టులో పిల్ వేయించారని తెలిపారు. వైసిపి ఇన్ని చర్యలకు పాల్పడినప్పటికీ ఆర్‌బిఐ, సెబీ క్లియరెన్స్ ఇచ్చిందన్నారు. వైసిపి హయాంలో ఎన్నో తాకట్టు పెట్టారు, ఎపి ఎమ్‌డిసి ద్వారా రూ.7 వేల కోట్లు రుణాన్ని పొందేందుకు ఉత్తర్వులు ఇచ్చారని మంత్రి తెలిపారు. ప్రతిపక్ష పార్టీ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర బ్రాండ్ ఎక్కడా తగ్గలేదన్నారు.

అప్పుల బాధతో యువ కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉరవకొండ



అప్పుల బాధతో యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా విడపనకల్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాల్తూరు గ్రామానికి చెందిన బోయ వన్నూరు స్వామి కుమారుడు గణేష్ (24) మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మూడేళ్లుగా మిరప పంటను సాగు చేస్తున్నారు. దిగుబడి సరిగా రాక, అరకొరగా పండిన పంటకు ధర లేక తీవ్రంగా నష్టపోయారు. దాదాపు రూ ఎనిమిది లక్షల మేరకు అప్పులు చేశారు. ముందస్తు కౌలు చెల్లిస్తూ లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. దిగుబడి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మంగళవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్‌ఆర్ మెమోరియల్ కోసం సోనియాకు లేఖ

- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు మీద హైదరాబాద్‌లో వైఎస్‌ఆర్ మెమోరియల్ ఏర్పాటు చేయాలని ఎఐసిసి అగ్రనేత సోనియా గాంధీని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల కోరారు. ఈ మేరకు సోనియా గాంధీతో పాటు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. వైఎస్‌ఆర్ 76వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలో వైఎస్‌ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైఎస్‌ఆర్ మెమోరియల్ ఏర్పాటుకు తెలంగాణ సిఎం చొరవ చూపాలని కోరారు. సమావేశంలో పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి పాల్గొన్నారు.



మార్కెట్లోకి మినీ ట్రక్ ఎస్ ప్రో విడుదల

- టాటా నుంచి మరో మూడు కొత్త వేరియంట్లు

హైదరాబాద్ : దిగ్గజ వాణిజ్య వాహన తయారీదారు అయిన టాటా మోటార్స్ సరికొత్త టాటా ఏస్ ప్రోను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. హైదరాబాద్‌లోని దీనిని టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ పినాకి హల్దార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దీని ధర రూ.3.99 లక్షల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఏస్ ప్రో పెట్రోల్, బై ఫ్యూయల్, ఎలక్ట్రిక్ వేరియంట్లలో లభిస్తుందన్నారు. టాటా ఏస్ ప్రో దేశంలోనే అత్యంత సరసమైన నాలుగు చక్రాల మినీ ట్రక్ అని తెలిపారు. ఇది అసాధారణ సామర్థ్యం, సాటిలేని బహుముఖ ప్రజ్ఞ మరియు ఉన్నతమైన విలువను అందిస్తుందని తెలిపింది. టాటా మోటార్స్ 1250 వాణిజ్య వాహనాల అమ్మకాల టచ్‌పాయింట్లలో ఈ వేరియంట్స్ లభిస్తాయన్నారు. టాటా ఏస్‌ను ఆవిష్కరించి 20 ఏళ్లు అవుతుందని.. ఈ కాలంలో 25 లక్షలకు పైగా యూనిట్లనువ విక్రయించామన్నారు.

మా సమస్యలు పరిష్కరించాల్సిందే

- ధవళేశ్వరంలో పోలవరం నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పోలవరం నిర్వాసితులు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అధికారి కార్యాలయం ఎదుట అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని పోలవరం నిర్వాసితులు మంగళవారం ధర్నా చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. 13 నిర్వాసిత కాలనీల నుంచి తరలివచ్చిన ప్రజలు కాటన్ బ్యారేజీ సెంటర్ నుంచి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఎఎస్‌ఆర్ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ పాలకులు, అధికారులు నిర్వాసితుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారన్నారు.

నిర్వాసితులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సి ఉందన్నారు. అలా చేయకుండా నిర్వాసిత కాలనీల కోసం ఒక్కో నిర్వాసితుడి నుంచి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి రూ.రెండు లక్షలు చొప్పున వసూలు చేసి మోసం చేశారన్నారు. గ్రామాలను ఖాళీ చేయించి మూడేళ్లయినా నేటికీ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదని తెలిపారు. తాగునీటి కోసం నిర్వాసితులు ఎనిమిది కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇదేనా నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చే పునరావాసం? అని ప్రశ్నించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించి కటాఫ్ డేట్‌ను 2016లో ప్రకటించారన్నారు. గ్రామాలను 2022లో ఖాళీ చేయించారన్నారు. దీంతో 18 ఏళ్లు నిండిన ఎంతోమంది యువత ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి దూరమయ్యారని వివరించారు.

ప్రభుత్వం స్పందించి 2023 నాటికి 18 ఏళ్లు నిండిన వారికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, పులి సంతోష్‌కుమార్, పులి అశోక్ పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా - అడ్మినిస్ట్రేటర్ అధికారి అభిషేక్

నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అడ్మినిస్ట్రేటర్ అధికారి అభిషేక్ హామీ ఇచ్చారు. ధర్నా విషయం తెలుసుకున్న ఆయన నిర్వాసితులతో స్వయంగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. సత్వరమే సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. దీంతో వారు ఆందోళనను విరమించారు.

వసతి గృహాల్లో ముఖ ఆధారిత హాజరు

- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్ని సంక్షేమ వసతి గృహాల్లో ముఖ ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేసి, ఆర్‌టిజిఎస్‌లో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్.. ఆయా సంక్షేమశాఖల అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమశాఖల వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ, భోజన, వసతి, నిర్వహణ తదితర అంశాలపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు ప్రస్తుతం ఉన్న డైట్ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ వద్దన్నారు. భోజనశాలలు పూర్తిగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాల కలెక్టర్లు సహా ఆయా సంక్షేమశాఖల అధికారులు, రాష్ట్ర స్థాయి అధికారులు తరచూ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. కొన్నిచోట్ల వసతి గృహాల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు సంభవిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నెలాఖరు నాటికి ఆప్కో నుంచి నాణ్యమైన బెడ్ షీట్లు, కార్పెట్లను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమశాఖల కార్యదర్శి ఎంఎం నాయక్, బిసి సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ ఆయా శాఖల వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల అడ్మిషన్లు, అందిస్తున్న సౌకర్యాలు, వాటి పనితీరు తదితర అంశాలను వివరించారు.

వ్యవసాయ ఫీడర్లకు 9 గంటల విద్యుత్ సరఫరా

వ్యవసాయ ఫీడర్లకు 9 గంటల విద్యుత్ సరఫరా అందించాలని అధికారులను సిఎస్ విజయానంద్ ఆదేశించారు. సచివాలయం నుంచి ఎపిఇపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ పరిధిలో విద్యుత్ సరఫరాపై సిఎమ్‌డిలు పృథ్వీతేజ్, సంతోషరావు, ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఎకెవి భాస్కర్‌తో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వీసు వైర్ల వల్ల ఏవైనా సమస్యలు తలెత్తితే వైర్లను మార్చాలని తెలిపారు. వర్షాకాలం కావడంతో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సంస్థల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిఎం సూర్యఘర్ పథకం పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు.

విద్యుత్ భారాల పెంపును ఉపసంహరించాలి

- వైసిపి అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ భారాల పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే వెనక్కు తీసుకోవాలని వైసిపి అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఐదేళ్లపాటు ఛార్జీలు పెంచబోమని సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీలేమయ్యాయని ఆయన ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రజలు, రైతులు నడ్డి విరిచేలా విద్యుత్ భారాలు పెంచేందుకు డిస్కమ్‌లు ప్రతిపాదించాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.15,485 కోట్లు భారం మోపిందని పేర్కొన్నారు.

సామ్‌సంగ్ నుంచి ఎం 9 స్మార్ట్ మానిటర్ విడుదల

న్యూఢిల్లీ : దిగ్గజ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ ఇండియా కొత్తగా స్మార్ట్ మానిటర్ సిరీస్‌లో ఎం9, ఎం8, ఎం7 మోడళ్లను ఆవిష్కరించింది. ఇవి 32 అంగుళాల 4కె క్యూడీ-ఒఎల్ఇడి డిస్‌ప్లేను కలిగి ఉంది. ఎఐ ఫీచర్లు, ధ్వని నాణ్యత, 165 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 0.03 మిల్లీసెకన్ల రెస్పాన్స్ సమయం, ఎన్‌విడియా జి-సింక్‌తో గేమింగ్ తదితర ఫీచర్లను కలిగి ఉన్నాయని ఆ కంపెనీ పేర్కొంది. ఎం8, ఎం7 మోడళ్లు ఎఐ ఆధారిత సులభ వినియోగాన్ని అందిస్తాయని పేర్కొంది. అయితే వీటి ధరలను ఆ కంపెనీ వెల్లడించలేదు.

గ్రాట్యూటీ, ఇఎల్ ఎన్‌క్యాష్మెంట్ చెల్లించాలి

- ఎస్‌టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గ్రాట్యూటీ, ఇఎల్ ఎన్‌క్యాష్మెంట్ తదితర తుది చెల్లింపులను ప్రభుత్వం చేయడం లేదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి కేవలం కమ్యూటేషన్ మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తున్నారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత పది నెలలుగా ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యూటీ మొత్తాన్ని, గత మూడేళ్లుగా ఇఎల్ ఎన్‌క్యాష్మెంట్ చెల్లించడం లేదని తెలిపారు. పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించే ఏర్పాటు చేస్తామని, పెన్షనర్స్‌కు కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని మేనిఫెస్టోలో పేర్కొన్న కూటమి ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రోన్ సర్వైలెన్స్‌తో 'పహారా'

- మహిళలపై నేరాల అదుపునకు 156 శక్తి టీమ్స్
- 900 హాట్‌స్పాట్స్ గుర్తింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళలపై నేరాలను ముందస్తుగానే పసిగట్టి వాటిని అదుపు చేసేందుకు పోలీస్‌శాఖ డ్రోన్ సర్వైలెన్స్‌తో నిఘాను తీవ్రతరం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా తరచూ మహిళలు, బాలికలపై ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, నేరాలు జరిగేందుకు వీలుండే ప్రాంతాలుగా 900 హాట్‌స్పాట్‌లను పోలీస్‌శాఖ గుర్తించింది.

ఆయా ప్రాంతాలపై శక్తి టీమ్స్ ద్వారా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసింది. శాంతి భద్రతలను పరిరక్షించే కార్యక్రమంతో పాటు మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ సిసి కెమెరాల ఫుటేజీలను కూడా సేకరించే పనిలో ఆ శాఖ నిమగ్నమైంది. రాష్ట్రంలో జీరో ఎఫ్ఐఆర్ ఉండాలని, ఆ దిశగా పోలీస్‌శాఖ పనిచేయాలని సిఎం చంద్రబాబు తరచూ వ్యాఖ్యానిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 156 శక్తి బృందాలను పోలీస్‌శాఖ నియమించింది. గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతాలను శక్తి బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మహిళల్లో మనో ధైర్యాన్ని కల్పించేందుకు ఇప్పటికే ప్రయత్నిస్తున్నాయి. ఈ బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 20,928 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. 1,266 ఎస్‌ఒఎస్ కాల్స్‌ను స్వీకరించి, విజయవంతంగా ఆయా ఫిర్యాదులను పరిష్కరించినట్లు ఆ శాఖ పేర్కొంటోంది.

261 కేసుల్లో 137 మందికి కఠిన శిక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి వివిధ కోర్టుల్లో 216 కేసుల్లో 137 మందికి కఠిన శిక్షలు పడ్డాయి. ఇందులో జీవిత ఖైదు, 20 నుంచి 25 సంవత్సరాల శిక్షలు పడగా, నలుగురికి మరణశిక్షలు, 66 మందికి జీవితఖైదు, 7 నుంచి 20 సంవత్సరాలు 47 మందికి, 10 సంవత్సరాలు అంతకంటే తక్కువ కాలం శిక్షలు 137 మందికి వివిధ కోర్టుల్లో శిక్షలు పడ్డాయి. తాజాగా ఈ నెల 6న పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో మైనర్ బాలిక ముఖంపై యాసిడ్ పోస్తానని బెదిరించి, లైంగిక దాడికి పాల్పడినట్లు నమోదైన పోక్సో కేసులో నిందితునికి రూ.1.10 లక్షల జరిమానాతో పాటు జీవిత ఖైదును భీమవరం పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది.

జెన్ స్ట్రీట్ అక్రమార్జన కేసు.. సెబీ నియంత్రణ వైఫల్యం లేదు

- రెగ్యులేటరీ మాజీ చీఫ్ మాధబి బుచ్



ముంబయి : భారత స్టాక్ మార్కెట్లలో వేలాది కోట్ల అక్రమార్జనకు పాల్పడినట్లు అమెరికన్ సంస్థ జెన్ స్ట్రీట్‌పై రుజువులు బయటపడుతోంటే.. మరోవైపు దీనిపై భారత స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధబి పూరి బుచ్ మాత్రం భిన్నంగా స్పందించారు. ఈ కుంభకోణంలో సెబీ నియంత్రణ వైఫల్యం లేదన్నారు. ఏప్రిల్ 2024 నుండి ఈ విషయంపై సెబీ చురుకుగా విచారణ చేస్తోందని తెలిపారు. నియంత్రణ వైఫల్యంపై వస్తోన్న వార్తలను అమె ఖండించారు. జెన్ స్ట్రీట్‌పై 105 పేజీల రిపోర్ట్‌ను తయారు చేశామన్నారు. ఇది తన పర్యవేక్షణలోనే ప్రారంభమైందన్నారు. జెన్ స్ట్రీట్ సంస్థ దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు సెబీ ఇటీవల నిర్ధారించింది. చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడిన అమెరికాకు చెందిన జెన్ స్ట్రీట్ గ్రూపు సంస్థలను సెబీ శుక్రవారం నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

జెన్ స్ట్రీట్ మోసంలో మాధబి పూరి బుచ్ వ్యక్తిగత సంబంధాలు లేదా స్వార్థ ప్రయోజనాలు ఉండొచ్చని ఆరోపణలు వచ్చాయి. హెచ్ఎండి రీసెర్చ్ నివేదికలో మాధబి బుచ్, ఆమె భర్తకు కొన్ని కంపెనీలతో ఆర్థిక సంబంధాలు ఉన్నాయని, అవి సెబీ నిర్ణయాలను ప్రభావితం చేశాయని పేర్కొంది. ఈ ఆరోపణలు సెబీ పారదర్శకత, నీతిపై ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ ఆరోపణలను మాధబి బుచ్ తిరస్కరించారు. తన నిర్ణయాలు నిష్పక్షపాతంగా, దేశ ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. సెబీ ఛైర్మన్‌గా మాధబి బుచ్ బాధ్యతలు ఉన్న కాలంలోనే.. జెన్ స్ట్రీట్ జనవరి 2023 నుండి మే 2025 వరకు జెన్ స్ట్రీట్ వేల కోట్లు అక్రమంగా ఆర్జించింది. ఇది రిటైల్ ఇన్వెస్టర్లకు భారీ నష్టాలను కలిగించింది. బుచ్ పదవీకాలంలో నియంత్రణ లోపాలు, పెద్ద గ్లోబల్ ఫండ్స్‌పై దృష్టి పెట్టకుండా చిన్న సంస్థలపై అతిగా నియంత్రణ విధించడం, హెచ్చరిక సంకేతాలను విస్మరించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సెబీ తమ సంస్థలపై నిషేధం విధించడంతో పాటు తమ నగదును అటాచ్ చేయడంపై సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో సవాలు చేయనున్నట్లు జెన్ స్ట్రీట్ తెలిపింది. కోర్టులో సవాలు చేయడంతో న్యాయ పోరాటానికి దిగుతామని పేర్కొంది. అక్రమ పద్ధతుల్లో దేశీయ స్టాక్ మార్కెట్‌లో కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన అమెరికన్ సంస్థ జెన్ స్ట్రీట్‌ను విచారిస్తామని సెబీ ప్రస్తుత ఛైర్మన్ తుహిన్ కాంత పాండే స్పందించారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాండే మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు మరోసారి జరగబోవన్నారు. నిఘా వ్యవస్థల బలోపేతంపై దృష్టి సారిస్తామన్నారు. ఈ తరహ మోసాలకు అవకాశమివ్వమని పేర్కొన్నారు. ఇందులో నిఘా వ్యవస్థ లోపం కూడా ఉందని పాండే ఒప్పుకున్నారు.

పేరుకుపోయిన కార్ల నిల్వలు

డీలర్ల వద్ద పెరుగుతున్న ఇన్వెంటరీస్



న్యూఢిల్లీ : దేశంలో కార్ల అమ్మకాలు పడిపోవడానికి తోడు ఎగుమతుల్లోనూ మందగింపునతో వాహన నిల్వలు పేరుకుపోతున్నాయి. వరుసగా పెంచిన ధరలకు తోడు, డిమాండ్ పడిపోవడంతో అమ్మకాల లేక దేశవ్యాప్తంగా డీలర్ల వద్ద కోట్ల రూపాయల విలువైన కార్ల నిల్వలు పోగుబడుతున్నాయి. ఆటోమొబైల్ పరిశ్రమ ప్రస్తుతం ఎదుర్కొనే అమ్మకాల సవాళ్ల గురించి ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ (ఫాడా) ఆందోళన వ్యక్తం చేసింది. సరఫరా పరిమితులు, అధిక ఇన్వెంటరీ స్థాయిలు రిటైల్ విక్రయాల వృద్ధికి అండంకిగా మారాయని తెలిపింది. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా సుంకాల నుండి వచ్చే స్పిల్‌ఓవర్ ప్రభావాలు వినియోగదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. అదే సమయంలో చైనా అరుదైన లోహాల ఎగుమతి నిషేధాలు వాహన సరఫరాను మరింత ఒత్తిడికి గురి చేయవచ్చని ఎఫ్ఎడిఎ పేర్కొంది. ఈ ఏడాది మేలోని విక్రయాలతో పోల్చితే జూన్‌లో రిటైల్ వాహన అమ్మకాలు 9.4 శాతం క్షీణించాయి. ఒక కారు షోరూంలో ఉండే సగటు సమయం, లేదా ఇన్వెంటరీ రోజులు మే నెలలో 52-53 రోజులుగా ఉండగా.. ఇది జూన్‌లో సుమారు 55 రోజులకు పెరిగాయి. ఇది ఎఫ్ఎడిఎ సిఫార్సు చేసిన 21 రోజుల గడపు కంటే చాలా ఎక్కువ. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన హెచ్చు సుంకాలు, దేశీయంగా కఠిన ఫైనాన్సింగ్ విధానం భారతీయ కార్ల తయారీదారులకు తీవ్రమైన సవాళ్లుగా నిలిచాయని ఎఫ్ఎడిఎ పేర్కొంది. అయితే ప్రస్తుతం దేశంలో స్వల్ప కాలంలోనే సాధారణం కంటే ఎక్కువ రుతుపవనాల నమోదుతో సమీప భవిష్యతులో అమ్మకాలు పెరగొచ్చని ఆశాభావం వ్యక్తం చేసింది.

విద్యుత్ కార్ల అమ్మకాల్లో 80 శాతం వృద్ధి

ఈ ఏడాది జూన్‌లో విద్యుత్ కార్ల అమ్మకాల్లో 80 శాతం పెరుగుదల చోటు చేసుకుందని ఎఫ్ఎడిఎ వెల్లడించింది. ప్యాసింజర్ వాహనాల మార్కెట్‌లో ఇవిల వాటా 4.4 శాతానికి పెరిగిందని తెలిపింది. అయితే.. మొత్తం ప్యాసింజర్ వాహన అమ్మకాలు మే నెలతో పోలిస్తే 9.4 శాతం తగ్గినప్పటికీ.. ఇవి విక్రయాలు పెరగడం విశేషం. ఈ ఏడాదిలో విద్యుత్ వాహన పరిశ్రమ మెరుగైన వృద్ధిని నమోదు చేస్తోంది. 2025 తొలి ఆరు మాసాల్లో రెండంకెల వృద్ధిని సాధించింది. వాహన్ పోర్టల్‌లోని రిటైల్ అమ్మకాల సంఖ్యల ప్రకారం.. జనవరి నుండి జూన్ 2025 మధ్య రెండు, మూడు చక్రాల వాహనాలు, ప్యాసింజర్, వాణిజ్య వాహన విభాగాలలో మొత్తం 1.04 లక్షల యూనిట్ల డెలివరీలు నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంలోని 8.96 లక్షల యూనిట్ల అమ్మకాలతో పోల్చితే 17 శాతం పెరుగుదల చోటు చేసుకుంది.

మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని నిలిపేయడం తగదు

- సిఎంకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ


ప్రజాశక్తి - కోటవురట్ల (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో రూ.500 కోట్లతో నిర్మించతలపెట్టిన మెడికల్ కాలేజీని అర్ధాంతరంగా నిలిపివేయడం తగదంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ లేఖ రాశారు. లేఖతో పాటు అర్ధాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కాలేజీ నిర్మాణ భవనాల ఛాయాచిత్రాలను జతపరిచారు. లేఖలోని వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. గత ప్రభుత్వ పాలనలో ప్రారంభమై దాదాపు రెండు స్లాబ్‌ల వరకూ పూర్తయిన మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేయడం తగదన్నారు. నిర్మాణ సామగ్రిని అమరావతికి తరలించడం ఎంతవరకూ సబబని ప్రశ్నించారు. ఇటీవల తమ బృందం మెడికల్ కాలేజీ ప్రాంతంలో పర్యటించి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించినట్టు తెలిపారు. ఏ ప్రాంత అభివృద్ధిలోనైనా ప్రధాన భూమిక పోషించేది విద్య అని, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు నిలిపివేయడం వల్ల గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారని పేర్కొన్నారు. ఇంతవరకూ వెచ్చించిన సొమ్ము వృథా కాకుండా తక్షణమే పనులు మొదలుపెట్టి వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సరైన వైద్య విద్య అందుబాటులో లేక చైనా, ఉక్రెయిన్ వంటి దేశాలకు వెళ్లి విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు.

కారు బోల్తా

- మహారాష్ట్రకు చెందిన ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - ఉరవకొండ (అనంతపురం జిల్లా)



రోడ్డు ప్రమాదంలో కారుబోల్తా పడి ముగ్గురు దుర్మరణం చెందిన ఘటన అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం బూదగవి గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మృతులు మహారాష్ట్రానికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఉరవకొండ సిఐ మహానంది, ఎస్ఐ జనార్ధననాయుడు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని శివ గౌవ్‌లోని హమ్మద్ నగర్‌కు చెందిన శ్రీకర్ (25), తుషార్ (23), కార్తీక్ (22), సుమిత్ కలసి తిరుమల శ్రీవారిని దర్శనం చేసుకుని కారులో వెళ్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఉరవకొండ మండలం బూదగవి గ్రామ సమీపంలోకి వచ్చేసరికి కారు ఆదుపు తప్పి బోల్తా పడి నుజ్జునుజ్జయ్యింది. అందులో ప్రయాణిస్తున్న శ్రీకర్, తుషార్, కార్తీక్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సుమిత్‌ను ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిఐ మహానంది, ఎస్ఐ జనార్ధననాయుడు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సంపాదకీయం

ఆశాకిరణం

బ్రిక్స్ 17వ శిఖరాగ్ర సదస్సు దక్షిణ దేశాల స్వరాన్ని బలంగా వినిపించడం ముదావహం. ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, పశ్చిమాసియా తదితర ప్రాంతాల్లోని 11 దేశాలతో, ప్రపంచంలో దాదాపు సగం జనాభాకు ప్రాతినిధ్యం వహించే బ్రిక్స్ బలం దాని వైవిధ్యంలోనే ఉంది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా వ్యవస్థాపక దేశాలు కాగా, ఆ తరువాత దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరికతో ఈ కూటమి మరింత బలపడింది. బ్రెజిల్‌లోని రియో డిజినారోలో రెండు రోజులపాటు నిర్వహించిన ఈ సదస్సు ఇచ్చిన డిక్లరేషన్ అగ్రరాజ్యం అమెరికాను కలవరపరిచింది. విచక్షణా రహితంగా సుంకాలను పెంచడం ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీసి, మరింత కుంచింపజేసే ప్రమాదముందని, ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీసి, అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాల్లో అనిశ్చితికి కారణమవుతుందన్న బ్రిక్స్ డిక్లరేషన్ వెలువడగానే ట్రంప్ మరోసారి ఆంక్షల పాట ఎత్తుకోవడం గర్హనీయం. అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి వేదికగా ఉన్న బ్రిక్స్ ఒక దేశానికి వ్యతిరేకంగానో, అనుకూలంగానో లేదు. ఈ వేదికలో కొన్ని అమెరికా మిత్రదేశాలు కూడా భాగస్వాములే. తాజా డిక్లరేషన్ 'అమెరికా ఫస్ట్' అంటూనే సుంకాల పేరుతో ప్రపంచంపై పెత్తనం చేసేందుకు ట్రంప్ చేస్తున్న యత్నాలు ఇక సాగబోవన్న హెచ్చరిక కూడా.

డిక్లరేషన్ వెలువడగానే... అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న, బ్రిక్స్‌కు మద్దతు తెలుపుతున్న దేశాలపై 10 శాతం సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ ప్రకటించేశారు. ప్రతీకార సుంకాల నిలిపివేత గడువు ముగియడంతో ఆ గడువును చైనా మినహా ఇతర దేశాలకు ఆగస్టు 1 వరకూ పొడిగించారు. అప్పటి నుంచి వర్తించే నూతన టారిఫ్ రేట్లపై 14 దేశాల అధినేతలకు లేఖలు పంపించారు. టారిఫ్ రేట్లు ఇతర విధానాలపై కూడా ఆధారపడి ఉంటాయన్న ఆ ప్రకటన అసమంజసం. ప్రపంచంపై పెత్తనం చేయడానికి మీరేమీ చక్రవర్తి కాదన్న బ్రెజిల్ అధ్యక్షుడి ప్రకటన అమెరికా ఏకపక్ష విధానాలపై అభిశంసనే. అమెరికా ఆంక్షలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రష్యా 'బ్రిక్స్ కామన్ కరెన్సీ' అంటూ చేసిన ప్రతిపాదన అగ్రరాజ్యానికి మరింత కలవరపాటైంది. ఆయా దేశాలు తమ దేశీయ కరెన్సీలో వాణిజ్య కలాపాలు నిర్వహించినా 'డాలర్' వాణిజ్యం మరింతగా క్షీణిస్తుందన్న భయమే ఈ హూంకరింపులకు కారణం. అమెరికా నేతృత్వంలోని జి -7 దేశాల జిడిపి తగ్గుతుండగా, బ్రిక్స్ కూటమిలో దేశాల జిడిపి పెరుగుతుండటంతో అగ్రరాజ్యం మరింతగా ఆందోళనపడుతోంది. ఆర్థిక, సాంకేతిక, విద్యారంగాల్లో పరస్పరం సహకారం పెంపొందించుకోవడానికి, ఎదగడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు బ్రిక్స్ దోహదపడుతుంది. అంతర్జాతీయ పరిపాలనా సంస్కరణలను ముందుకు తీసుకెళ్లాలన్న చైనా లాంటి దేశాల ప్రతిపాదన, భద్రతా మండలి సహా అంతర్జాతీయ సంస్థలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సంస్కరించాలన్న ఇండియా లాంటి దేశల ఆకాంక్ష సముచితమైనవి. పహల్గాం ఉగ్రదాడిని ఖండించడంతోపాటు ఉగ్రవాదంపై పోరాటానికి ఎలాంటి మినహాయింపులు ఉండరాదన్న సదస్సు పిలుపు సరైనదే. జి - 7 సదస్సుకు గత నెలలో పరిశీలక హోదాలో హాజరైన మన దేశం ఇప్పుడు బ్రిక్స్ వ్యవస్థాపక దేశాల్లో ఒకటిగా ప్రధాన పాత్ర పోషించింది. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు తీసుకోనున్న తరుణంలో అమెరికా ఒత్తిడికి లొంగిపోయే విధానాలను విడనాడటం భారత్‌కు అత్యావశ్యకం. రష్యా, చైనా అధినేతలు వేర్వేరు కారణాల వల్ల హాజరు కాలేకపోయారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి తొలగి, జవసత్వాలు పుంజుకోవడానికి, అందరికీ ఉపాధి, ఆరోగ్యం, హక్కులు లభించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలు మరింతగా ఎదగడం అత్యవసరం. ఈ వేదిక నిర్ణయాత్మకమైన, ఏకీకృత శక్తిగా ఎదిగితే బహుళ ధ్రువ ప్రపంచ ఆవిర్భావం అసాధ్యమేమీ కాదు. సామరస్యపూర్వక, పరస్పర గౌరవాన్ని ఇచ్చుకునే బ్రిక్స్ ఆచరణ అందుకు దోహదపడుతుందని ఆశిద్దాం.

మహనీయుల మాట




కార్మిక వర్గం చేసే పోరాటాల విజయం అది సాధించే తక్షణ ఫలితాలలో లేదు. ఈ పోరాటాల క్రమంలో అది సాధించే అపూర్వ ఐక్యతే అతి గొప్ప విజయం.

- కారల్ మార్క్స్


Karl Marx

ఆర్ఎస్ఎస్ విషపు కోరలు బట్టబయలు

విశ్లేషణ



ఎం.ఎ. బేబి



> యాభై ఏళ్ల క్రితం దేశంలో ఇందిరా గాంధీ ప్రకటించిన ఎమర్జెన్సీని విమర్శించే సందర్భాన్ని పురస్కరించుకుని...లౌకికవాదం, సోషలిజం అన్న పదాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇందిరా గాంధీ రాజ్యాంగ పీఠికలో చొప్పించారు కాబట్టి ఆ రెండు పదాలనూ తొలగించాలనే వాదన ముందుకు తెచ్చారు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి. రాజ్యాంగంలో కీలకమైన ఈ సూత్రాలను తోసిపుచ్చడానికి ఆర్ఎస్ఎస్ పచ్చి మోసకారితనంతో ఎమర్జెన్సీని సాకుగా చూపుతున్నది. ఇదే ఆర్ఎస్ఎస్ సంస్థ తన మనుగడను కాపాడుకోవడానికి ఎమర్జెన్సీని సమర్థించి శ్రీమతి గాంధీ ప్రభుత్వంతో లాలూచీ పడిన విషయాన్ని మరుగున పరచాలని చూస్తున్నది. అదే ఆర్ఎస్ఎస్ ఇవాళ పచ్చి రాజకీయ అవకాశవాదంతో చారిత్రక విషయాల పట్ల మతిమరుపును ప్రదర్శిస్తూ ఎమర్జెన్సీని అడ్డం పెట్టుకుని రాజ్యాంగ మౌలిక సూత్రాల మీద దాడి చేయాలని చూస్తున్నది. లౌకికవాదం, సోషలిజం అనేవి కేవలం పదాలు కాదు, భారతదేశం ఆధునిక ప్రజాస్వామ్య దేశమని చాటి చెప్పడానికి ఉపకరించే మౌలిక భావనలు.

భారత రాజ్యాంగ పీఠిక నుండి లౌకికవాదం, సోషలిజం పదాలను తొలగించాలని గత కొద్ది రోజులుగా ఆర్ఎస్ఎస్ నాయకత్వం బహిరంగంగా పిలుపునిస్తున్నది. ఇది కేవలం పదబంధాల గురించిన చర్చ కాదు. మన దేశ రాజ్యాంగ పునాదుల మీద చేస్తున్న ప్రత్యక్ష దాడి. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన మహత్తర స్వాతంత్ర్య పోరాటం తాలూకు ఆకాంక్షలను, ఆశయాలను మన రాజ్యాంగంలో పొందు పరుచుకున్నాము. స్వాతంత్ర్యం సముపార్జించు కోవడానికి, వివిధ ప్రజా ఉద్యమాలు, ఏకోన్ముఖంగా చేసిన మహోజ్వల పోరాట విలువలను మన రాజ్యాంగం ప్రతిఫలిస్తుంది. లౌకికవాదం, సోషలిజం అన్న భావనలు రాజ్యాంగ పీఠికకే పరిమితం కాదు. రాజ్యాంగ మౌలిక సూత్రాల్లో, రోజువారీ అనుసరించే ఆదేశిక సూత్రాల్లో, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక బాధ్యతలతో అవి ఇమిడి ఉన్నాయి. 50 ఏళ్ల క్రితం దేశంలో ఇందిరా గాంధీ ప్రకటించిన ఎమర్జెన్సీని విమర్శించే సందర్భాన్ని పురస్కరించుకుని...లౌకికవాదం, సోషలిజం అన్న పదాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇందిరా గాంధీ రాజ్యాంగ పీఠికలో చొప్పించారు కాబట్టి ఆ రెండు పదాలనూ తొలగించాలనే వాదన ముందుకు తెచ్చారు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి. రాజ్యాంగంలో కీలకమైన ఈ సూత్రాలను తోసిపుచ్చడానికి ఆర్ఎస్ఎస్ పచ్చి మోసకారితనంతో ఎమర్జెన్సీని సాకుగా చూపుతున్నది. ఇదే ఆర్ఎస్ఎస్ సంస్థ తన మనుగడను కాపాడుకోవడానికి ఎమర్జెన్సీని సమర్థించి శ్రీమతి గాంధీ ప్రభుత్వంతో లాలూచీ పడిన విషయాన్ని మరుగున పరచాలని చూస్తున్నది. అదే ఆర్ఎస్ఎస్ ఇవాళ పచ్చి రాజకీయ అవకాశవాదంతో చారిత్రక విషయాల పట్ల మతిమరుపును ప్రదర్శిస్తూ ఎమర్జెన్సీని అడ్డం పెట్టుకుని రాజ్యాంగ మౌలిక సూత్రాల మీద దాడి చేయాలని చూస్తున్నది. లౌకికవాదం, సోషలిజం అనేవి కేవలం పదాలు కాదు, భారతదేశం ఆధునిక ప్రజాస్వామ్య దేశమని చాటి చెప్పడానికి ఉపకరించే మౌలిక భావనలు.

సామాజిక - ఆర్థిక న్యాయం పట్ల నిబద్ధత

రాజ్యాంగంలోని 'సోషలిజం' అన్న పదం సామాజిక, ఆర్థిక న్యాయం అందించడానికి దోహదపడుతుంది. అసమానతలు తొలగించి సంక్షేమ రాజ్య స్థాపనకు హామీనిస్తుంది. భారతదేశ స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా మాత్రమే కాకుండా సమాజంలోని దోపిడీ, వివక్షతకు వ్యతిరేకంగా కూడా ఉద్యమాలు సాగాయి. ఆ ఉద్యమాల ప్రతిఫలమే రాజ్యాంగంలో సోషలిజం స్ఫూర్తిని పొందుపరచడంగా మనం గుర్తించాలి. కమ్యూనిస్టులతో పాటు భగత్‌సింగ్, అతని సహచరులు కూడా సోషలిస్టు భావజాల స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. భారత రాజ్యాంగం సిపిఐ(ఎం) ఆశిస్తున్న విధంగా సమాజంలోని ఉత్పత్తి విధానాలన్నింటినీ సామాజిక యాజమాన్యం కిందకు తీసుకొచ్చి ఆర్థిక, సామాజిక దోపిడీని పూర్తిగా రద్దు చేసి స్థాపించే సోషలిజాన్ని దార్శనికతగా ఎంచుకోలేదు. సమాజంలో ప్రజలందరూ తర, తమ బేధం లేకుండా స్వేచ్ఛగా, సమ భావనతో మెలిగే మెరుగైన శాస్త్రీయ సోషలిస్టు వ్యవస్థ సాధన కోసం సిపిఐ(ఎం) తన పోరాటాన్ని కొనసాగిస్తున్నది. అయితే చారిత్రకంగా తీవ్ర ఆర్థిక దోపిడీ, సామాజిక అణచివేతలకు ఆలవాలంగా ఉన్న మన దేశంలో అసమానతలు తగ్గించి, ప్రజలకు స్వేచ్ఛను కల్పించేందుకు రాజ్యాంగం పునాది వేసింది.

42వ రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో సోషలిజం అన్న పదాన్ని చేర్చక మునుపే రాజ్యాంగం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని...పౌరులందరికీ సమానత్వ స్థాయిని, అవకాశాలను కల్పిస్తానని స్పష్టం చేసింది. అంటే సోషలిజం అన్న పదాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించకపోయినా రాజ్యాంగంలో సోషలిస్టు స్ఫూర్తిని పొందుపరిచారు మన రాజ్యాంగ నిర్మాతలు.

మన రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు సోషలిస్టు దార్శనికత దిశగా వేసిన ముందడుగులు. రాజ్యాంగంలోని 14వ అధికరణం చట్టం ముందు అందరూ సమానులే, చట్టం అందరికీ సమ రక్షణ కల్పిస్తుంది అని పేర్కొన్నది. కులం, మతం, ప్రాంతం, జాతి, జండర్ ఆధారంగా ఏ పౌరుడూ వివక్షకు గురి కాకూడదని మన రాజ్యాంగంలోని 15వ అధికరణం స్పష్టం చేస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగావకాశాలలో సమాన అవకాశాలు కల్పించాలని 16వ అధికరణం నిర్దేశిస్తున్నది. రాజ్యాంగంలోని పీఠికతో పాటు ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులను కలిపి చదువుకుంటే దోపిడి లేని సమాజాన్ని, ప్రతి పౌరుడు ఆత్మగౌరవంతో జీవించే సమాజాన్ని మన కళ్ళ ముందు ఆవిష్కరిస్తుంది.

ఆదేశిక సూత్రాల్లో నాల్గవ భాగంలోని 36 నుండి 51వ ప్రకరణం వరకూ చూస్తే మన రాజ్యాంగం లోని సోషలిస్టు దార్శనికత బోధపడుతుంది. 'రాజ్యం ప్రజలకు సంక్షేమాన్ని సమకూర్చి రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం అందించే శక్తివంతమైన ఒక క్రమాన్ని పరిరక్షించేలా జాతి జన జీవితంలోని అన్ని సంస్థలకూ ఉపదేశించాల'ని ఆర్టికల్ 38 స్పష్టం చేస్తున్నది.

1) ఆడ, మగ తేడా లేకుండా ప్రజలందరికీ జీవించే సమాన హక్కు కల్పించాలని, 2) భౌతిక వనరులను ప్రజలందరి ఉమ్మడి ప్రయోజనాలు ఈడేర్చేలా పంపిణీ చేసే యాజమాన్యం, నియంత్రణలు ఉండాలని, 3) ఉత్పత్తి సాధనాల మీద ఉమ్మడి ప్రయోజనాలను దెబ్బ తీసేలా అదుపు ఉండకుండా, సంపద కొద్దిమంది చేతుల్లో పోగు పడకుండా చూసే ఆర్థిక వ్యవస్థ నిర్వహణ ఉండాలని, 4) స్త్రీ, పురుషులు ఇరువురికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని రాజ్యాంగంలోని 39వ అధికరణం రాజ్యాన్ని నిర్దేశిస్తున్నది. అలాగే పని చేసే హక్కు, చదువుకునే హక్కులకు ప్రభుత్వ తోడ్పాటు ఉండాలని 41వ అధికరణం స్పష్టం చేస్తుంది. పని ప్రదేశంలో మానవీయ పరిస్థితులు కల్పించాలని 42వ అధికరణం నిర్దేశిస్తుంది. గౌరవప్రదమైన జీవితం గడపడానికి తగిన జీత భత్యాలు చెల్లించాలని 43వ అధికరణం ఆదేశిస్తుంది.

వీటిని కేవలం ఆకాంక్షా ప్రకటనలుగా పరిగణించరాదు. అనేక సందర్భాలలో ఈ అధికరణల గురించి న్యాయపరమైన భాష్యాలు, తీర్పులు వెలువడడంతో పాటు చట్టాలు కూడా రూపొందించబడ్డాయి. భూ సంస్కరణల చట్టం, ప్రభుత్వ రంగ పరిశ్రమలు నెలకొల్పడం, వివిధ సామాజిక సంక్షేమ పథకాలు రూపొందించడం ఇందులో భాగమే.

ఆదేశిక సూత్రాలను అమలు పరచాలని చట్టపరంగా ఒత్తిడి చెయ్యలేం కానీ ఈ ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో పొందుపరచడానికి రాజ్యాంగ సభలో పెద్ద ఎత్తున వాదోపవాదాలు నడిచిన సంగతిని మనం మరువరాదు. ఆదేశిక సూత్రాల అమలుకు చట్టబద్ధత కల్పించకూడదన్న నిర్ణయం పాలక శక్తుల వర్గ స్వభావాన్ని బట్టబయలు చేస్తున్నది. పాలక వర్గాలు ఆనాడు నెలకొని ఉన్న చారిత్రక పరిస్థితుల దృష్ట్యా సోషలిస్టు దృక్పథాన్ని నేరుగా తిరస్కరించే స్థితిలో లేవు. విశాల ప్రాతిపదికన ప్రజలలో సోషలిజం పట్ల సానుకూల దృక్పథం ఉండడమే అందుకు కారణం. అందుకే సోషలిస్టు స్ఫూర్తితో రూపొందించిన ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో పొందు పరచినప్పటికీ వాటి అమలు మీద పాలక వర్గాలు తమ పూర్తి నియంత్రణను కూడా అట్టిపెట్టుకున్నాయి.

లౌకికవాదం - మౌలిక సిద్ధాంతం

భారత రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకికవాదం అంటే అర్థం మతపరమైన తటస్థత పాటించడం కాదు. రాజ్యం అన్ని మతాలనూ సమాన ఫాయిదాలో పరిగణిస్తుందని, మైనార్టీల హక్కులను పరిరక్షిస్తుందని, మత విశ్వాసం ఆధారంగా ఏ భారతీయ పౌరుడూ వివక్షకు గురికాకుండా చూస్తుందన్న సానుకూల వాగ్దానాన్ని ఇవ్వడమే లౌకికవాదానికి అర్థం.

ఎమర్జెన్సీని అడ్డం పెట్టుకుని శ్రీమతి గాంధీ రాజ్యాంగ పీఠికలో 'లౌకికి వాదం' అనే పదాన్ని చొప్పించారని కాషాయ పరివారం నానా యాగీ చేస్తుంది కానీ వాస్తవానికి రాజ్యాంగంలోనే '(మత) విశ్వాసం, ఆరాధన, అనుసరణ, ఆలోచన అభివ్యక్తీకరణలకు ప్రతి పౌరుడికీ స్వేచ్ఛ ఉంటుందనీ, ప్రతి పౌరుడి విశ్వాసాన్ని, గౌరవనీయతను పరిరక్షిస్తుందనీ' స్పష్టంగా పేర్కొన్నారు. ఇది లౌకిక స్ఫూర్తిగాక మరేమిటి?

ప్రాథమిక హక్కులు మూడవ భాగంలో మత స్వేచ్ఛ హక్కును కల్పించిన ఆర్టికల్ 25, 26, 27, 28 లను పరికిస్తే మన రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తిని తక్కువ చేసి చూడడానికి ఎవరూ సాహసించరు. ఆర్టికల్ 25 ప్రతి పౌరునికి తాను నమ్మిన మతాన్ని మత విశ్వాసాన్ని ఆచరించి, అనుసరించి ప్రచారం చేసుకునే హక్కును కల్పించింది. ఆర్టికల్ 26 ప్రతి ఒక్క మతస్తుల సముదాయం తమ మతాచారాలను నిర్వహించుకునే హక్కును కల్పించింది. ఏదేని మతాన్ని ప్రచారం చేసుకునేందుకు పన్నులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఆర్టికల్ 27 వెసులుబాటు కల్పించింది.

ఇక ఆర్టికల్ 29, 30లు మైనారిటీ మతస్తులు తమ సాంస్కృతిక, విద్యా విషయాలను పరిరక్షించుకునే హక్కును కల్పించాయి. మైనార్టీలు తమ భాష, లిపి, సంస్కృతులను పరిరక్షించుకోవడానికి రాజ్యాంగపరమైన హక్కులు ప్రసాదించింది. ప్రభుత్వ విద్యా సంస్థలలో గానీ, ఎయిడెడ్ విద్యా సంస్థలలో గానీ మతం ఆధారంగా ప్రవేశాన్ని నిరోధించడాన్ని నిషేధించారు. అలాగే మైనార్టీ మతస్తులు స్వయంగా విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకుని నిర్వహించుకోవడానికి హక్కులు కల్పించారు.

వాటన్నిటిని బట్టి మనకు ఏం అర్థం కావాలి? రాజ్యం మతం ఆధారంగా ఎటువంటి వివక్షకు పాల్పడకూడదని, మత విశ్వాసాలతో సంబంధం లేకుండా ప్రతి పౌరునికీ సమాన హక్కులు, పరిరక్షణలు కల్పించాలనే కదా!

దీనికి తోడు సమాజంలోని బలహీన వర్గాలను అన్ని రకాల దోపిడీల నుండి పరిరక్షించడానికి, సామాజికంగా అన్యాయానికి గురి కాకుండా చూడడానికి రాజ్యం ఆయా వర్గాల విద్యా విషయక, ఆర్థిక ప్రయోజనాలు పెంపొందించేందుకు తగిన అన్ని చర్యలూ చేపట్టాలని ఆదేశిక సూత్రాలలోని ఆర్టికల్ 46 స్పష్టం చేస్తున్నది. ప్రభుత్వం అధికారికంగా నియమించిన సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిషన్ వంటి కమిటీలు, కమిషన్‌ల అధ్యయనాలు మన దేశంలోని మతపరమైన మైనార్టీలు మిగిలిన పౌర సమాజంతో పోలిస్తే సామాజికంగా, ఆర్థికంగా చాలా వెనుకబాటుతనం అనుభవిస్తున్నారని వెల్లడించాయి.

సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో లౌకికవాదం మన రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో అంతర్భాగమని స్పష్టం చేసింది. లౌకికవాదం అంటే రాజ్యానికి మత ప్రసక్తి లేకుండడం, అన్ని మతాల పట్ల సమాన ఫాయిదాతో వ్యవహరించడం అని కూడా సుప్రీంకోర్టు పలు మార్లు నొక్కి వక్కాణించింది.

1973లో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులో పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరించే చట్టబద్ధమైన విస్తృతమైన హక్కు ఉందిగానీ, రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని గానీ స్వభావాన్ని గాని మార్చే హక్కుగానీ, కాలరాసే హక్కుగానీ పార్లమెంటుకు లేదని తేల్చి చెప్పింది. అంటే రాజ్యాంగ మౌలిక నిర్మాణం, స్వభావం అనుల్లంఘనీయమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చిన 3 సంవత్సరాల తర్వాత 1976లో శ్రీమతి గాంధీ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో లౌకికవాదం, సామ్యవాదం అన్న పదాలను చేర్చడం రాజ్యాంగ మౌలిక నిర్మాణ స్వభావాలకు లోబడే జరిగింది. రాజ్యాంగంలో అంత:సూత్రంగా పొందుపరిచిన విలువలనే రాజ్యాంగ పీఠికలో చేర్చినందున ఇది రాజ్యాంగ ఉల్లంఘన కానేరదు.

(వ్యాసకర్త సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి)

/ మిగతాది రేపటి సంచికలో /

★

ఇది యుద్ధం కాదు - మానవ హననం

సమస్య





ఎ. అజ శర్మ

> అక్టోబర్ 2023 తర్వాత గాజాపై ఇజ్రాయిల్ దాడులు పెరిగిన వేళ, అమెరికా 14.3 బిలియన్ డాలర్ల అదనపు మిలిటరీ సహాయం మంజూరు చేసింది. బాంబులు, మిసైళ్లు, డ్రోన్లు సహా హైటెక్ ఆయుధాలను అందించింది. ఇవి పౌరులపై మారణాయుధాలుగా మారుతున్నాయి. తాత్కాలిక కాల్పుల విరమణ కోసం పెట్టిన ఐక్యరాజ్యసమితి తీర్మానాలన్నిటినీ అమెరికా వీటో చేసింది. ఇతర దేశాలలో మానవ హక్కుల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని వాదించే అమెరికా...ఇక్కడ తమ మిత్ర దేశమైన ఇజ్రాయిల్‌కు అండగా నిలవడం...అమెరికా దురాక్రమణపూరిత వైఖరికి, చమురు నిక్షేపాలు పుష్కలంగా వున్న పశ్చిమాసియాలో తన పట్టు సాధించడానికి చేస్తున్న కుటిల చర్యలకు నిదర్శనాలు.

గాజా! పాలస్తీనా లోని 365 చదరపు కిలోమీటర్ల వైశాల్యం, 21 లక్షల జనాభా కలిగిన చిన్న భూభాగం. 2023 అక్టోబర్ నుండి అమెరికా అండతో ఇజ్రాయిల్ ప్రారంభించిన సుదీర్ఘ దాడులు ఇప్పటికీ ఆగలేదు. పౌరులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఇది కేవలం రాజకీయ సమస్య కాదు, ఇది మానవ హక్కుల ఉల్లంఘన. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, 2023 అక్టోబరు 7నుండి 2025 జులై 6 వరకు 57,418 మంది చనిపోయారు. ఇందులో సగానికి పైగా మహిళలు, పిల్లలు. ప్రతి బాంబు పిడుగులో ఓ తల్లి ఒడిలోని పసికందు చనిపోతోంది.

నీళ్లు లేని జీవితం, ఆహారం లేని శరీరం

విద్యుత్, నీటి సరఫరా వనరులను ధ్వంసం చేయడం వల్ల ప్రజల బాధలు వర్ణనాతీతం. వేలాది మంది ఆకలితో చనిపోతున్నారు. బేబీ ఫార్ములా లేకపోవడంతో అనేక మంది పసిపిల్లలు ఆకలి వల్ల ప్రాణాలు కోల్పోయారు. పిల్లల పోషణ స్థితి అత్యంత దారుణంగా మారింది. యునిసెఫ్ నివేదిక ప్రకారం తీవ్ర పోషకాహార లోపం పిల్లల్లో 146 శాతం పెరిగింది.

ఆసుపత్రుల మీద దాడులు

గాజాలోని ఆసుపత్రులు దాడుల లక్ష్యంగా మారాయి. ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది. వందల సంఖ్యలో ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు ధ్వంసమై, ప్రస్తుతం పనిచేయని స్థితిలో ఉన్నాయి. దాంతో చిన్న పిల్లలు, గర్భిణీలు కూడా వైద్య సహాయానికి నోచుకోలేకపోతున్నారు. మెనింజైటిస్, మలేరియా వంటి వ్యాధులు వేగంగా వ్యాపిస్తున్నాయి.

మానవతా సహాయం మీదా...

ప్రపంచ మానవతా సంస్థలు పంపించే సహాయాన్ని కూడా దాడులకు గురిచేసే స్థితి ఏర్పడింది. 'గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ పథకం' కింద నడిచే 400 సహాయ కేంద్రాలు ధ్వంసమై నేడు కేవలం నాలుగుకే పరిమితం అయ్యాయి. రాయటర్స్, అల్‌జజీరా వార్తల ప్రకారం సహాయ పంపిణీ కోసం వేచి ఉన్న ప్రజలపై కూడా దాడులు జరిగి పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు.

అంతర్జాతీయ చట్టాల ప్రకారం, పౌరుల మీద దాడులు, ఆహారం అందనివ్వకుండా ఆకలితో మాడేలా శిక్షించడం వంటి చర్యలు మానవ హక్కుల ఉల్లంఘనే కాకుండా జినోసైడ్ (జాతి నిర్మూలన) కిందకు వస్తాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు ఈ చర్యలను అమానవీయంగా పేర్కొన్నాయి.

అమెరికా అండతో...

అక్టోబర్ 2023 తర్వాత గాజాపై ఇజ్రాయిల్ దాడులు పెరిగిన వేళ, అమెరికా 14.3 బిలియన్ డాలర్ల అదనపు మిలిటరీ సహాయం మంజూరు చేసింది. బాంబులు, మిసైళ్లు, డ్రోన్లు సహా హైటెక్ ఆయుధాలను అందించింది. ఇవి పౌరులపై మారణాయుధాలుగా మారుతున్నాయి. తాత్కాలిక కాల్పుల విరమణ కోసం పెట్టిన ఐక్యరాజ్యసమితి తీర్మానాలన్నిటినీ అమెరికా వీటో చేసింది. ఇతర దేశాలలో మానవ హక్కుల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని వాదించే అమెరికా...ఇక్కడ తమ మిత్ర దేశమైన ఇజ్రాయిల్‌కు అండగా నిలవడం...అమెరికా దురాక్రమణ పూరిత వైఖరికి, చమురు నిక్షేపాలు పుష్కలంగా వున్న పశ్చిమాసియాలో తన పట్టు సాధించడానికి చేస్తున్న కుటిల చర్యలకు నిదర్శనాలు.

సైలెన్స్ ఫర్ గాజా

ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల సంస్థలు, కార్మిక సంఘాలు, శాంతి కాముకులు, పౌర సమాజ కార్యకర్తలు, కళాకారులు, విద్యార్థులు ఐక్యంగా ఇచ్చిన పిలుపు సైలెన్స్ ఫర్ గాజా. ఇది కేవలం మౌనం కాదు. ఇది ఓ ప్రతిఘటన. ఇది గాజాలో జరుగుతున్న దుర్మార్గాలను చూస్తున్నామని, ప్రశ్నిస్తున్నామని, సమర్థించడం లేదని చెప్పడం. యావత్ ప్రపంచం నిశ్శబ్దంగా గాజాకు అండగా నిలవడం ద్వారా అక్కడి ప్రజలకు వారు ఒంటరులు కాదని చెప్పగలం. మార్పులు వెంటనే సాధ్యపడకపోయినా, ఈ మౌనం ప్రజా భావనగా మారి ప్రభుత్వాలపై ఒత్తిడిని కలిగిస్తుంది.

నల్లజాతీయుల హక్కుల కోసం అమెరికాలో పాటించిన "మౌన ప్రదర్శనలు" చరిత్రలో ఒక శాంతియుత ఉద్యమంగా నిలిచాయి. అలాగే, "సైలెన్స్ ఫర్ గాజా" కూడా, హింసను వ్యతిరేకించేందుకు మానవతావాదులు చేసే నిరసనగా మారుతుంది. ఈ మౌనం "ఎంత మంది చనిపోయిన తరువాత మీరు స్పందిస్తారు?" అనే ప్రశ్నను లేవనెత్తుతుంది. ఇది మనలోని మానవత్వాన్ని మేల్కొలిపే ప్రయత్నం.

ఇజ్రాయిల్ కండకావరం పాలస్తీనాకే పరిమితం కాలేదు. పొరుగు దేశాలైన జోర్డాన్, ఈజిప్ట్, సిరియా, లెబనాన్, యెమెన్ వంటి దేశాలపైనా ఎక్కుపెట్టింది. తాజాగా ఇరాన్ మీద యుద్ధానికి దిగింది. అమెరికా ప్రత్యక్ష అండ చూసుకుని పేట్రేగిపోతోంది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆక్స్‌ఫామ్ వంటి సంస్థల అభియోగాలు, చివరకు ఐక్యరాజ్య సమితి మాటలను కూడా వినే స్థితిలో ఇజ్రాయిల్, అమెరికా లేవు.

అన్నింటి కంటే దురదృష్టకరం...కిరాతక ఇజ్రాయిల్, అమెరికాలతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అంటకాగడం. దశాబ్దాల నాటి మన దేశ పాలస్తీనా ప్రజల మాతృ భూమి సంఘీభావ విదేశాంగ విధానాన్ని సమూలంగా మార్చివేయడం. ఇది దేశ స్వాతంత్రోద్యమ స్ఫూర్తికే విరుద్ధం.

గాజా సంక్షోభం మన కళ్ల ముందు జరుగుతున్న మానవ విపత్తు. మానవతా చైతన్యంతో స్పందించాల్సిన సమయమిది.

/వ్యాసకర్త ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి/

గళమే గద్దెకు గుణపాఠం!

కవిత్వం

వాళ్ల మాటల్లో "వికాసం"
అయినా...
ఒక "కాంట్రాక్టు కార్మికుని కన్నీరు"
స్కీం వర్కర్ గళం
"పెన్షన్ పొదుపు లూటీలు"
"మధ్యతరగతి బాధలు"
అసంఘటిత రంగ కార్మికుల
వెతలు
పాలకులకు వినిపించవు!

మోడీ లేబర్ కోడ్‌లతో
పని గంటల పెంపు
సమ్మె, సంఘం హక్కులు హుళక్కి
పెరుగుతున్న ధరలు -
పడిపోతున్న ఉపాధి
ఉపాధి కల్పనకు బదులుగా -
మెగా యోగా ఫోటో దినోత్సవాలు!

అందుకే...
జులై తొమ్మిదో తేదీ,
కేవలం సమ్మె కాదు -
ఆవేదనకు అరుపు
కష్టజీవులందరి గొంతు -
కార్మికుల సంకల్ప గీతి!

ఒక్క అడుగు ముందుకేస్తే
చరిత్ర తిరుగుతుంది,
ఉక్కుపాదం వేసిన వాడికి
నడ్డి విరుగుతుంది
చట్టాలూ వంగిపోతాయి!

ఒకప్పటి పెర్మనెంట్ ఉద్యోగం
ఇప్పటి కాంట్రాక్టు పనిగా మారింది,
ఉపాధి వేటలో-యువత
నిస్సహాయంగా,
అభివృద్ధి పేరుతో-కార్మికుని బతుకే
వేలం!
కనీస వేతనానికి కనీస కనికరం
లేదు
ప్రభుత్వ సంస్థల అమ్మకం
సంపద స్వాహా! వనరుల లూటీ!!

కేంద్రం తలచిన లేబర్ కోడ్లకు-
రాష్ట్రం పాదాభివందనం,
చంద్రబాబు పాలనలో
"మోడీ విధానం-తెలుగుదేశం
ముద్రతో!"

ఒకప్పుడు
'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు',
ఇప్పుడేమైందీ?-అడిగితే అరెస్ట్
విశాఖ ఉక్కు వెనక-శ్రామికుల
శ్వాస ఉంది,
ఆ శ్వాస ఆగితే-అభివృద్ధి పేరు
శ్మశానమే!

వేతనాలు లేవు, హక్కులు లేవు
సంఘటితమై సమరమే శరణ్యం
జులై తొమ్మిదిన
వాడ వాడన, వీధి వీధిన
గళమే గద్దెకు గుణపాఠం!

- సీతారామ్

(జులై 9 అఖిల భారత సమ్మె సందర్భంగా)

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

రాజ్యాంగంతోనే రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం

- మహారాష్ట్ర అసెంబ్లీ సన్మానంలో సిజెఐ జస్టిస్ గవాయ్

నాగ్‌పూర్: రాజ్యాంగం ద్వారానే పౌరులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం దక్కుతుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అన్నారు. దేశంలో అస్థిరతకైనా రాజ్యాంగమే అత్యున్నతమైనదని చెప్పిన అంబేద్కర్, న్యాయవ్యవస్థపై కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం చేసుకోకుండా స్వేచ్ఛగా ఉండాలని ఆకాంక్షించారన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పౌరుల హక్కులను కాపాడేందుకు న్యాయవ్యవస్థ కాపలా ఉండాలని అంబేద్కర్ తెలిపారని పేర్కొన్నారు. యుద్ధ సమయంలో మనందరినీ రాజ్యాంగం ఐక్యంగా ఉంచుతుందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారని చెప్పారు. రాజ్యాంగం నిశ్చలంగా ఉండదని, ఎప్పుడూ మారుతూ ఉంటుందని ఆయన అన్నారని వివరించారు. దేశాన్ని పాలించేవారు కుల, మతాలను దాటి కష్టపడి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని సూచించినట్లు తెలిపారు.



మహారాష్ట్ర అసెంబ్లీలో సిజెఐ గవాయ్‌కు సన్మాన దృశ్యం

మహారాష్ట్ర అసెంబ్లీ సన్మానం

అంతకుముందు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌ను మహారాష్ట్ర అసెంబ్లీ సన్మానించింది. అత్యున్నత న్యాయ పీఠాన్ని అందుకున్నందుకు ఆయనను అభినందిస్తూ మహారాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. జస్టిస్ గవాయ్‌ను శాసనసభ తరఫున ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సన్మానించారు.

రెండో దళిత వ్యక్తిగా జస్టిస్ బిఆర్ గవాయ్ రికార్డు

జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు. సిజెఐ జస్టిస్ గవాయ్ తండ్రి ఆర్‌ఎస్ గవాయ్ బీహార్, కేరళ గవర్నర్‌గా పనిచేశారు. అంబేద్కర్ వాది అయిన ఆర్‌ఎస్ గవాయ్ పార్లమెంట్ సభ్యులుగా కూడా పనిచేశారు. 1985లో బిఆర్ గవాయ్ లా ప్రాక్టీస్ ప్రారంభించారు. ఆ తర్వాత, భోసలే వంటి సీనియర్ న్యాయవాదులతో కలిసి పనిచేసే అవకాశంలోనే స్వతంత్రంగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఆ తర్వాత మునిసిపల్ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నాగ్‌పూర్ బెంచ్‌లో కెరీర్ ప్రారంభించిన ఆయన తన పట్టుదలతో సిజెఐ స్థాయి వరకు ఎదిగారు. జస్టిస్ కెజె బాలకృష్ణన్ తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన రెండో దళిత వ్యక్తిగా జస్టిస్ బిఆర్ గవాయ్ రికార్డు సాధించారు.

700 ధర్మాసనాల్లో భాగస్వామిగా

2000లో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, అనంతరం నాగ్‌పూర్ బెంచ్‌లో ప్రభుత్వ ప్లీడర్ అయ్యారు. 2003లో హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2005లో శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన 2025 మే 14న భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పదవీకాలం 2025 నవంబర్ 23 వరకు ఉంటుంది. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన జస్టిస్ గవాయ్ ఆరేళ్ల కాలంలో సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు. అనేక సంచలన కేసుల తీర్పుల్లో భాగస్వామిగా జస్టిస్ గవాయ్ ఉన్నారు.

ఉగ్రదాడుల్లో డిజిటల్ వేదికల కీలక పాత్ర!

- ఆన్‌లైన్ చెల్లింపులు, ఇ కామర్స్ వేదికలతో ఉగ్రవాదుల దుశ్చర్యలు
- వెల్లడించిన ఎఫ్ఎటిఎఫ్ నివేదిక

న్యూఢిల్లీ : పుల్వామా ఆత్మాహుతి బాంబుదాడి (2019 ఫిబ్రవరి), గోరఖ్‌నాథ్ ఆలయం (2022 ఏప్రిల్)పై జరిగిన ఉగ్రవాద దాడులతో సహా భారతదేశంలోని పలు దాడులకు పే పాల్ వంటి ఆన్‌లైన్ చెల్లింపుల సేవలను, వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్స్ (విపిఎన్), ఇ కామర్స్ వేదికలను ఉపయోగించినట్లు ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) ఒక నివేదికలో మంగళవారం వెల్లడించింది. ఉగ్ర కార్యకలాపాలకు అవసరమైన నిధుల కోసం డిజిటల్ వేదికలైన సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్‌లను, క్రౌడ్ ఫండింగ్ సైట్‌లను కూడా విరివిగా ఉపయోగించినట్లు తెలిపింది. పుల్వామా కేసులో పేలుడుకు కారణమైన కీలకమైన అల్యూమినియం పౌడర్‌ను అమెజాన్ నుండి కొనుగోలు చేసినట్లు ఆ నివేదిక వెల్లడించింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్ తీవ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారు. ఇక గోరఖ్‌నాథ్ కేసులో దాడికి పాల్పడిన వ్యక్తి తన గుర్తింపును దాచిపెట్టి విపిఎన్‌ను ఉపయోగించి పే పాల్ ద్వారా విదేశీ ఖాతాలకు రూ.6.6లక్షలు పంపాడు. విదేశాల నుండి కూడా డబ్బును అందుకున్నాడు. ఐసిస్‌తో సంబంధమున్న ఇతరులకు పంపడానికి కూడా ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నాడు. అనుమానాస్పద కార్యకలాపాలు కారణంగా పే పాల్ తర్వాత ఆ వ్యక్తి ఖాతాను స్తంభింపచేసింది. కొన్ని తీవ్రవాద గ్రూపులు ఎలా ఇటువంటి సౌకర్యాలను ఉపయోగించు కుంటున్నాయో ఆ నివేదిక వివరించింది. నిధులు, శిక్షణ, స్మగ్లింగ్ వంటి వాటి కోసం విరివిగా వీటిని వాడుతున్నాయి. ఉదాహరణకు ఒక దేశానికి చమురును తరలించడం, అక్కడ దాన్ని విక్రయించి బంగారంగా మార్చడం, ఆ తర్వాత దాన్ని మరో దేశ పరిధిలో నగదుగా మార్చడం వంటి కార్యకలాపాలు జరిగాయని ఆ నివేదిక పేర్కొంది. పైగా ఉగ్రవాద కార్యకలాపాలన్నీ కూడా వికేంద్రీకరించబడ్డాయని ఆ నివేదిక వివరించింది. ప్రాంతీయ ఆర్థిక కేంద్రాలు, స్వీయ ఆర్థిక విభాగాలు, స్థానిక సంబంధాలను పెట్టుకోవడం, నేరపూరితమైన ఆదాయాల నుండి వ్యాపార కార్యకలాపాల్లో పెట్టుబడులుపెట్టడం వరకు ఇలా అనేక రకాలైన ఆదాయ వనరులు వున్నాయని నివేదిక పేర్కొంది.

ఆర్థిక సమస్యల్లో టెస్లా

ఒక్క పూటలో లక్షల కోట్లు ఆవిరి


వాషింగ్టన్ : అమెరికాలోని ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ టెస్లాకు రోజు రోజుకు ఆర్థిక సమస్యలు తీవ్రమవుతున్నాయి. టెస్లా అధినేత ఎలన్ మస్క్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య వివాదం వెలుగులోకి వచ్చిన తర్వాత టెస్లా ఆదాయం, లాభాలు భారీగా తరిగిపోతున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుదారులకు 7,500 టాక్స్ క్రెడిట్‌ను ట్రంప్ ఇటీవల తొలగించారు. టెస్లా 2019 నుంచి 10.6 బిలియన్ల రెగ్యులేటరీ క్రెడిట్స్ ఆదాయం పొందింది. ఇది ఆ కంపెనీకి భారీగా లాభాలను తెచ్చి పెట్టింది. ఈ క్రెడిట్స్ లేకపోతే టెస్లా 2021 వరకు లాభం ఆర్జించలేదు. తాజాగా దీన్ని ఎత్తివేయడంతో ఆ కంపెనీ ఆదాయాలపై ఒత్తిడి పెరిగింది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో టెస్లా నికర ఆదాయం 71 శాతం పడిపోయింది. మరోవైపు అమ్మకాలు తగ్గాయి. చైనాలోని బివైడి వంటి పోటీదారులు, మస్క్ రాజకీయ వైఖరిని నిరసిస్తూ కొంతమంది కొనుగోలుదారుల ఆందోళనలు కూడా టెస్లాకు సవాళ్లుగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే టెస్లా షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. సోమవారం ఒక్క రోజులోనే టెస్లా షేర్ 6.8 శాతం క్షీణించింది. దీంతో ఆ కంపెనీ మార్కెట్ కాపిటలైజేషన్ 68 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.5.8 లక్షల కోట్లు) కరిగిపోయింది.

ప్రధాని మోడీకి బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారం



బ్రెజిలియా : ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరో గౌరవం లభించింది. బ్రెజిల్ పర్యటనలో ఉన్న మోడీ అక్కడి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా.. 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతకుముందు అక్కడి రియో డి జనీరో నగరంలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోడీ పాల్గొన్నారు.). ఈ సందర్భంగా 'బహుళపక్షవాదం, ఆర్థిక వ్యవహారాలు, కృత్రిమ మేధ'పై ప్రసంగించారు. అత్యాధునిక సాంకేతిక సాధనాల తయారీలో కీలకమైన ఖనిజాలను (క్రిటికల్ మినరల్స్) ఏ దేశమూ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వాటిని ఇతరులపై ఆయుధాలుగా ఉపయోగించుకునే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ఈ నెల జులై 2న మొదలైన ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటన బుధవారం వరకు కొనసాగనుంది. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ పర్యటనలను పూర్తిచేసుకున్న మోడీ.. నమీబియాలో అడుగుపెట్టనున్నారు. గడిచిన మూడు దశాబ్దాల్లో ఈ దేశంలో పర్యటించే తొలి భారత ప్రధానిగా నిలువనున్నారు. ఇక ఘనా పర్యటనలో భాగంగా అక్కడి అత్యున్నత పురస్కారం "ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా"తో సత్కరించారు.

ల్యాండ్ రోవర్ డిఫెండర్ ఆక్టా బ్లాక్ విడుదల



న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ల్యాండ్ రోవర్ తన అత్యంత శక్తివంతమైన డిఫెండర్ ఆక్టా బ్లాక్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. ఈ ఆల్-బ్లాక్ ఎడిషన్ నార్విక్ బ్లాక్ రంగులో 30 ఎక్స్‌టీరియర్ ఎలిమెంట్స్‌తో రూపొందించబడిందని ఆ కంపెనీ పేర్కొంది. టర్బో వి8 మైల్డ్-హైబ్రిడ్ ఇంజన్ 635 హార్స్‌పవర్‌తో కేవలం 3.8 సెకన్లలోనే 0-100 వేగాన్ని పుంజుకోనుందని ఆ కంపెనీ పేర్కొంది. భారత్‌లో ఈ ఎడిషన్ డెలివరీలు ప్రస్తుత ఏడాది చివరలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

మహిళల పట్ల
అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు

● సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరమని, ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. వైసిపి నేతల తీరులో మార్పు రావడం లేదని, మహిళలను దూషించడం, బూతులు తిట్టడం, కించపరచడం అనేది ఆ పార్టీ రాజకీయ సిద్ధాంతంగా పెట్టుకుందన్నారు. మహిళలను అవమానపరచడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఆ పార్టీ డిఎన్‌ఎలోనే ఉందని సిఎం ఆరోపించారు. చెల్లి పుట్టుకపైన వ్యాఖ్యలు చేసిన వారి నాయకత్వంలో పనిచేస్తున్న నేతలు అంతే దారుణంగా, అసహ్యంగా మాట్లాడుతూ వారి నీచ సంస్కృతిని చాటుకుంటున్నారన్నారు. మహిళలపై వ్యక్తిగత విమర్శలు చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న వీరు మనుషులేనా? ఇది రాజకీయమా? మహిళల, మహిళా నాయకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, ప్రణాళికా బద్ధంగా వైసిపి చేస్తున్న కుట్రలను ప్రతి పౌరుడు గమనించాలని సిఎం పేర్కొన్నారు.

హరికృష్ణపై చిత్రహింసలు

● హైకోర్టులో వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి కార్యకర్త ఫిర్యాదు మేరకు హరికృష్ణ అనే డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని హింసించారనే ఘటనపై హైకోర్టు విచారణ జరిపింది. పల్నాడు జిల్లా, దాచేపల్లి సిఐ పొన్నూరు భాస్కర్, ఎస్‌ఐ సౌందర్య రాజు చిత్రహింసలకు గురి చేశారని హరికృష్ణ తండ్రి యల్లయ్య దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ నూనెపల్లి హరినాథ్ విచారించారు. హరికృష్ణను ఎందుకు అరెస్టు చేశారో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. గత నెల 21 సాయంత్రం 4 గంటల నుంచి 23వ తేదీ మధ్యాహ్నం వరకు దాచేపల్లి పోలీస్ స్టేషన్ నుంచి తంగేడు గ్రామం చెన్నయపాళెం క్రాస్ రోడ్డు వరకు సిసి కెమెరా ఫుటేజీని సమర్పించాలని దాచేపల్లి పోలీసులను ఆదేశించారు. తన కుమారుడిపై దాడి చేయడమే కాకుండా తమపై టిడిపి కార్యకర్త షేక్ హుస్సేన్ గత మే 22న పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని, అన్యాయంగా తన కొడుకును అరెస్టు చేసి హింసించారని, ఈ విషయాలను రిమాండ్ సమయంలో తన కొడుకు కింది కోర్టుకు చెప్పారని పిటిషనర్ వాదన. అరెస్ట్ చేసే నాటికే హరికృష్ణ శరీరంపై గాయాలు ఉన్నాయని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. గత నెల 22 రాత్రి ఒంటి గంటకు అరెస్ట్ చేసే ఉదయం 3-4 గంటలకు వాంగ్మూలాన్ని నమోదు చేశామన్నారు. వాదనపై స్పందించిన న్యాయమూర్తి, ప్రాథమికంగా చూస్తే పోలీసులు దాడి చేసినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. విచారణను ఈ నెల 9కి వాయిదా వేశారు.

'స్థానికం' కోసమే 'తొలిఅడుగు'?

● వినతుల వర్షంతో నేతల ఇబ్బందులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా చేపట్టిన తొలి అడుగు కార్యక్రమం స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంలో భాగమేనని టిడిపి నేతలు అంటున్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రతి ఎంఎల్‌ఎను ఇంటింటికి వెళ్లాలని ముఖ్యమంత్రి నిర్దేశించారని చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రులతో పాటు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు క్షేత్ర స్థాయికి వెళ్లాలని చంద్రబాబు ఆదేశించిన సంగతి తెలిసిందే. దీనికోసం పలువురు పార్టీ నేతలకు కూడా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను, ఆ కుటుంబంలోని సభ్యుల ఫోటోలతో సహా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన డాష్‌బోర్డులో అప్‌లోడ్ చేయాలని సిఎం సూచించారు. అయితే, ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి ప్రజల నుండి వినతుల వర్షం కురుస్తోందని టిడిపి నాయకులు చెబుతున్నారు. వివిధ సమస్యలపై ప్రజలు వినతులు పెద్ద సంఖ్యలో అందిస్తుడటం టిడిపి నేతలకు కొంత ఇబ్బందికరంగా మారింది. స్థానిక ఎన్నికలు జరిగేలోగా వీటిని పరిష్కరించకపోతే, వినతులు ఇచ్చిన వారే మరో రకంగా స్పందించే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాన్ని వీరు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి వచ్చే ఏడాది ఆరంభంలోనే పంచాయితీలు, మండల పరిషత్, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. 2021లో ఈ విభాగాలకు ఎన్నికలు జరగ్గా, తిరిగి 2026 ప్రారంభంలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అంటే ఎన్నికలకు ఏడు నెలల కాలం మాత్రమే ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకునే టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి తొలి అడుగు కార్యక్రమాన్ని రూపొందించారని చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఇళ్లు, ఇంటి స్థలాలు, తాగునీరు, వైద్యం, రోడ్లు, వ్యవసాయానికి సాయం వంటి అంశాలపైనే ఎక్కువగా వినతులు ఉన్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు చెబుతున్నారు.

గైర్హాజరుకు అవకాశం లేకుండా

ఇంటింటికీ నేతలు, కార్యకర్తలు వెళ్లాల్సిన సమయంలో ఎవరూ గైర్హాజరు కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ప్రతి ఇంటికీ ఒక లోకేషన్ చొప్పున ఫీడ్ చేసిన ట్యాబ్‌లను నేతలకు ఇస్తున్నారు. ఒక ఇంటి పర్యటన పూర్తయిన తరువాతే మరో ఇంటి వివరాలు ట్యాబ్‌లో కనిపించేలా రూపకల్పన చేయడం విశేషం. అలాగే ఒక్కో ఇంటికి మూడు నిముషాల సమయం ఇస్తున్నారని, రోజుకు కనీసం 30 ఇళ్లకు వెళ్లేలా కార్యక్రమాన్ని రూపొందించారని తెలిసింది.

త్వరలో 750 విద్యుత్ బస్సులు

ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రయాణీకుల అవసరాల కోసం త్వరలో 750 విద్యుత్తు బస్సులు ఆర్‌టిసికి రానున్నాయని ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు చెప్పారు. విజయవాడ ఆర్టీసీ హౌస్, ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవసరమైన చోట్ల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాలపై దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. ఆగస్టు 15నుంచి మహిళలకు కల్పించే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధమౌతున్నట్లు చెప్పారు.

ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ఆర్‌టిసికి భారం లేకుండా అవసరమైతే మరికొన్ని అద్దె బస్సులు తీసుకోవాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ కొత్త డిస్పెన్సరీల నిర్మాణంచేపట్ట దలచినట్లు తెలిపారు. అన్ని జోన్‌ల పరిధిలోఉద్యోగులకు మెరుగైన వైద్యసదుపాయం అందుబాటులో ఉండేలా డిస్పెన్సరీల్లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రయాణీకుల కోసం బస్టాండుల ఆధునీకరణ , సౌకర్యాలను మెరుగుపరచడం లాంటి అంశాలపై దృష్టిసారించామన్నారు. ఆర్‌టిసిలో సమస్యలపై చర్చించేందుకు ఇకపై ప్రతి 3 నెలలకు ఒకసారి బోర్డు సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్లు దొన్ను దొర, రెడ్డి అప్పలనాయుడు, సురేష్‌రెడ్డి, పూల నాగరాజు, సంస్థ వైస్ ఛైర్మన్ ద్వారకా తిరుమలరావు, బోర్డు డైరెక్టర్లు ఎస్ఎస్ రావత్, కాంతిలాల్ దండే, రోనాల్డ్‌రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లోనే డిగ్రీ ప్రవేశాలు

● ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించాలని, ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ కె మధుమూర్తికి, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె ప్రసన్నకుమార్, సహాయ కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, ఎన్‌టిఆర్ జిల్లా నాయకులు ప్రణీత, షణ్ముక్ వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. సాధారణ డిగ్రీ విద్యలో ఉన్నత విద్యామండలి తీసుకొస్తున్న మార్పులు విద్యార్థులను గందరగోళంలోకి నెడుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. సింగిల్ మేజర్ విధానం ఇప్పటికే ఆచరణలో విఫలమైందని, ఈ విధానాన్ని తిరిగి అమలు చేయడం భావ్యం కాదన్నారు. డబుల్ మేజర్ విధానాన్నే కొనసాగించాలని కోరారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా ఇప్పటికీ డిగ్రీ కళాశాలల్లో మొదటి ఏడాది ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. దీనివల్ల ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు ఇతర కోర్సుల్లో చేరే అవకాశం ఉన్నందున వెంటనే ప్రవేశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. డిగ్రీలో ప్రవేశాలు ఆన్‌లైన్లో ఉండటం వల్ల ఎక్కువ శాతం సీట్లు ఖాళీగా ఉండిపోతున్నందున ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలని కోరారు. ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించి, మైనర్ సబ్జెక్టులకు క్రెడిట్ పాయింట్స్ పెంచాలని, విద్యార్థుల చదువుకు తగ్గట్టుగా ఇంటర్న్‌షిప్ ఇవ్వాలని, తగిన స్టైఫండ్ ఇచ్చే విధంగా సంబంధిత పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకోవాలని కోరారు.

మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్ కేసుపై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

మద్యం విధానంలో అవకతవకలు జరిగాయంటూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 11కి వాయిదా వేస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్ రెడ్డి వాదిస్తూ, పిటిషనర్‌ను 39వ నిందితుడిగా చేర్చిన సిట్ దర్యాప్తు నోటీసులో సాక్షిగా పేర్కొందన్నారు. దర్యాప్తునకు సహకరిస్తామని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. సిట్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ, సిట్ దర్యాప్తునకు పిటిషనర్ సహకరించడం లేదన్నారు. రెండు నోటీసులకు స్పందన లేకపోవడంతో లుకౌట్ సర్క్యులర్ ఇవ్వాల్సి వచ్చిందన్నారు.

స్లీపర్‌సెల్స్ దర్యాప్తు నివేదికపై స్టే

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో స్లీపర్ సెల్స్‌కు సంబంధించిన నివేదిక ఇవ్వాలని డిజిపికి గతంలో సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును డివిజన్ బెంచ్ నిలిపివేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత రాష్ట్రంలో పెద్దయెత్తున స్లీపర్‌సెల్స్ ఆశ్రయం పొందుతున్నారన్న వాళ్ల చర్యలు తీసుకునేలా డిజిపికి ఉత్తర్వులు ఇవ్వాలని న్యాయవాది సూపరరెడ్డి గౌతమి, ప్రొద్దుటూరుకు చెందిన ఎ శివకుమార్ వేర్వేరుగా వ్యాజ్యాలు వేశారు. రాష్ట్రంలో స్లీపర్ సెల్స్ సంబంధించి విచారణ జరిపి పూర్తి నివేదిక ఇవ్వాలని మేలో డిజిపిని సింగిల్ జడ్జి ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను డివిజన్ బెంచ్ విచారించి స్టే విధించింది.

తాడేపల్లి పిఎస్‌లో కొమ్మినేని హాజరుకావాలి

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుకు బెయిల్ మంజూరు సమయంలో విధించిన షరతుల్లో ఒకదానిని మంగళవారం హైకోర్టు మార్పు చేసింది. చార్జిషీట్ వేసే వరకు ప్రతినెలా 2, 4 శనివారాలు తుళ్లూరు పిఎస్ ఎస్‌హెచ్ఒ ఎదుట హాజరవ్వాలన్న షరతును మార్పు చేసింది. తాడేపల్లి ఎస్‌హెచ్ఒ ఎదుట హాజరుకావాలంది. ఈ మేరకు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం ఆదేశాలిచ్చారు.

ఎస్‌పిఆర్‌ఇఇ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ డైరెక్టర్ ఇన్‌ఛార్జ్ రామారావు

ప్రజాశక్తి- విజయవాడ

యజమానులు మరియు ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రమోషన్ (ఎస్‌పిఆర్‌ఇఇ) పథకాన్ని ఉపయోగించుకోవాలని రాష్ట్ర యజమానులకు ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ డైరెక్టర్ ఇన్‌ఛార్జ్ ఎం. రామారావు విజ్ఞప్తి చేశారు. గరిష్ట సంఖ్యలో యజమానులు మరియు ఉద్యోగులను సామాజిక భద్రతా కవరేజ్‌లోకి తీసుకురావడానికి విజయవాడలోని ఇఎస్ఐ కార్పొరేషన్ ప్రాంతీయ కార్యాలయం ఓ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఎస్‌పిఆర్‌ఇఇ పథకం కింద కర్మాగారాల సంఖ్యను నమోదు చేయడానికి విజయవాడలోని ఇఎస్ఐ కార్పొరేషన్‌లోని ప్రాంతీయ కార్యాలయం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. యజమానులు తమ యూనిట్లను, ఉద్యోగులను ఇఎస్ఐ పోర్టల్, శ్రమ సువిధ, ఎంసిఎ పోర్టల్ ద్వారా డిజిటల్‌గా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. యజమాని ప్రకటించిన తేదీ నుండి రిజిస్ట్రేషన్ చెల్లుబాటు పరిగణించబడుతుందన్నారు. రిజిస్ట్రేషన్‌కు ముందు కాలాలకు ఎటువంటి సహకారం లేదా ప్రయోజనం వర్తించదని, రిజిస్ట్రేషన్‌కు ముందు కాలంలో ఎటువంటి తనిఖీలు లేదా గత రికార్డుల కోసం డిమాండ్ చేయరని తెలిపారు. ఈ పథకం మునుపు జరిమానాల భయాన్ని తొలగించడం ద్వారా, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా స్వచ్ఛంద సమ్మతిని ప్రోత్సహిస్తుందని తెలిపారు.

ఎస్‌పిఆర్‌ఇఇకి ముందు, నిర్దిష్ట సమయ వ్యవధిలోపు నమోదు చేయకపోవడం వల్ల చట్టపరమైన చర్యలు, పాత బకాయిల డిమాండ్ అడ్డంకులను ఎస్‌పిఆర్‌ఇఇ -2025 పరిష్కరిస్తుందన్నారు. వదిలివేయబడిన సంస్థలు, కార్మికులను ఇఎస్ఐలోకి తీసుకురావడం మరియు విస్తృత సామాజిక రక్షణను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్‌పిఆర్‌ఇఇ పథకం పురోగతిని ఇఎస్ఐ జాయింట్ డైరెక్టర్ ప్రణవకుమార్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

రెండో ర్యాంక్‌కు ఎగబాకిన దీప్తి

● ఐసిసి మహిళల టి20 ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా టి20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా మహిళా బౌలర్ దీప్తి శర్మ అదరగొట్టింది. ఇంగ్లండ్ పర్యటనలో రాణిస్తున్న దీప్తి.. మంగళవారం ఐసిసి ప్రకటించిన టి20 బౌలర్ల ర్యాంకిగ్స్‌లో రెండో స్థానానికి ఎగబాకింది. గత ఆరేళ్లుగా టాప్-10లో ఉంటున్న దీప్తి.. ఒక ర్యాంక్ మెరుగుపరుచుకొని టాప్-2కు ఎగబాకడం ఇదే తొలిసారి. అగ్రస్థానంలో సదియా ఇక్బాల్(పాకిస్తాన్) నిలువగా.. దీప్తికి నదియాకు 8 పాయింట్ల తేడానే ఉంది. నదియా ఇక్బాల్ 746రేటింగ్ పాయింట్లతో టాప్‌లో నిలువగా.. దీప్తి శర్మ ఖాతాలో 738పాయింట్లు ఉన్నాయి. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ఆల్‌రౌండర్‌కు కెరీర్లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. పేసర్ రేణుకా సింగ్ 706పాయింట్లతో 6వ స్థానంలో నిలిచి టాప్-10లో చోటు దక్కించుకుంది., రాధా యాదవ్ 18లో, తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి 11 స్థానాలు మెరుగుపరచుకొని 43వ ర్యాంక్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ పర్యటనలో దీప్తి మూడో టి20లో మూడు వికెట్లు తీసి తన ర్యాంక్‌ను మెరుగుపరచుకుంది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టాప్-5లో చోటు దక్కించుకుంది. ఇంగ్లండ్‌పై తొలి రెండు టి20ల్లో రాణించిన మంధాన.. 771రేటింగ్ పాయింట్లతో 3వ స్థానంలో నిలువగా.. టాప్‌లో బెత్ మూనీ(ఆస్ట్రేలియా) 794పాయింట్లు, హేలీ మాథ్యూస్(వెస్టిండీస్) 774పాయింట్లు టాప్-2లో ఉన్నారు. భారత మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 12వ స్థానంలో, షెఫాలీ వర్మ 13, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 వ స్థానంలో నిలిచి టాప్-20లో చోటు దక్కించుకున్నారు. టి20 ఆల్‌రౌండర్ల జాబితాలో దీప్తి శర్మ(394పాయింట్లు) టాప్-3లో నిలువగా.. హేలీ మాథ్యూస్(వెస్టిండీస్) 505 పాయింట్లు, అమెలీ కెర్ర్(న్యూజిలాండ్) 434పాయింట్లు టాప్-2లో ఉన్నారు.

ఐఐటి, నీట్‌లో సీటు సాధించిన గురుకులాల విద్యార్థులకు రూ.1 లక్ష

● మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐఐటి, నీట్‌లో అర్హత సాధించి మెడిసిన్, ఇంజినీరింగ్‌లో సీట్లు సాధించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలని ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ నిర్ణయించింది. తాడేపల్లి ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యాలయంలో 75వ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ సమావేశం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఐఐటి, నీట్‌లో అతి తక్కువ మార్కులతో అర్హత సాధించలేకపోయిన 120 మంది విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వాలని, గురుకులాలు, ఎస్‌సి సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు 11 రకాల వస్తువులతో కాస్మొటిక్ కిట్స్ ఇవ్వాలని బోర్డు సమావేశం నిర్ణయించింది. ప్రతి గురుకులంలో వీడియోకాన్ఫరెన్స్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు కల్పించేందుకు బోర్డు ఆఫ్ గవర్నెన్స్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో అనారోగ్యంతో మృతిచెందిన పల్నాడు జిల్లా, వినుకొండలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని సంకీర్తన భాయ్, తల్లిదండ్రులకు సాంత్వన పథకం కింద రూ.3 లక్షల చెక్కును మంత్రి అందజేశారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎంఎం నాయక్, ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ సెక్రటరీ ప్రసన్న వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్యవేణి, అడిషనల్ సెక్రటరీ సునీల్‌రాజ్, డిప్యూటీ సెక్రటరీ సంజీవరావు పాల్గొన్నారు.



ఆఫ్ఘనిస్తాన్ అంపైర్ షిన్వారీ కన్నుమూత

కాబూల్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్యానెల్ అంపైర్‌గా సేవలందిస్తున్న బిస్మిల్లా జాన్ షిన్వారీ(41) మంగళవారం కన్నుమూశారు. ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన షిన్వారీ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ.. మంగళవారం ఆరోగ్యం మరింత విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు ఆ దేశ క్రికెట్ బోర్డు(ఎసిబి) అధికారికంగా ఒక ప్రకటనలో వెల్లడించింది. షిన్వారీజిల్లాలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు కుటుంబ సభ్యులు మృతిచెందారు. 1984లో జన్మించిన షిన్వారీ, కెరీర్‌లో మొత్తం 60 అంతర్జాతీయ మ్యాచ్‌లకు అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వీటిలో 34వన్డేలు, 26టి20 మ్యాచ్‌లు ఉన్నాయి. మైదానంలోనే కాకుండా టీవీ అంపైర్‌గా కూడా ఆయన తన సేవలు అందించారు. షిన్వారీ అకాల మరణం పట్ల పలువురు క్రికెటర్లు, క్రీడా ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

'పోలవరం'లో యథేచ్ఛగా శ్రమ దోపిడీ!

- 12 గంటల పని.. సెలవులూ లేవు...
- వలస కార్మికుల దుర్భర జీవనం
- సిడబ్ల్యుఎఫ్ఐ నేత అర్కా రాజ్‌పండిట్

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ బందోబస్తు మధ్య నిర్మాణం సాగుతున్న పోలవరం బహుళార్ధ సాధక నీటి పారుదల ప్రాజెక్టు నిర్మాణంలో యథేచ్ఛగా కార్మిక దోపిడీ జరుగుతోందని భారత నిర్మాణరంగ కార్మికుల సమాఖ్య (సిడబ్ల్యుఎఫ్ఐ) ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన అర్కా రాజ్‌పండిట్ తెలిపారు. ఆయన తనను కలిసిన మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే... 'పోలవరం ప్రాజెక్టు బయట ప్రపంచానికి ప్రగతి చిహ్నంగా కనిపిస్తున్నా దాని వెనక కల్లోలపరిచే వాస్తవాలు కూడా వున్నాయి. అక్కడ యథేచ్ఛగా కార్మికుల శ్రమ దోపిడి జరుగుతోంది. అనూహ్యమైన రీతిలో విచ్చలవిడిగా కార్మిక చట్టాలు ఉల్లంఘించబడుతున్నాయి. బయటవారెవరికీ ప్రవేశం లేకుండా దుర్భేధ్యంగా మారిన ఈ ప్రాజెక్టు ప్రాంతంలో ఏ రూపంలోనైనా కార్మిక సంఘాల కార్యకలాపాలు నిషిద్ధం. కార్మిక సంఘాలకు అనుమతి లేదు. కార్మికులెవరూ సంఘటితం కాకుండా వారిని నిలువరించేందుకు, లేదా తమకు జరిగే అన్యాయం, అక్రమం గురించి మాట్లాడేందుకు వీల్లేకుండా చూసేందుకు భారీగా పహరాలు వుంటాయి. అడ్డూ అదుపు లేకుండా జరిగే కార్మిక హక్కుల ఉల్లంఘటనలు బయటి ప్రపంచానికి తెలియకుండా దాచడమే ఈ చర్యల లక్ష్యం.

జూన్ మూడవ వారంలో, భారత నిర్మాణరంగ కార్మికుల సమాఖ (సిడబ్ల్యుఎఫ్ఐ) ప్రతినిధి బృంద సభ్యులు పోలవరం ప్రాజెక్టును సందర్శించడానికి ప్రయత్నించారు. పోలీసుల అనుమతి వున్నప్పటికీ, వారిని గేటు వద్దే నిలువరించారు. వారిని, వాహనాలను కూలంకషంగా సోదాలు చేశారు. కార్మిక సంఘాలకు ఇక్కడ ప్రవేశం లేదని కూడా చెప్పారు. భద్రతా బలగాలనుండి ఎన్నిఆటంకాలు ఎదురైనా మొత్తానికి ప్రతినిధి బృందం ప్రాజెక్టు ప్రాంతాలను సందర్శించింది. పలువురు కార్మికులతో మాట్లాడింది. అక్కడ జరుగుతున్న శ్రమ దోపిడి గురించి, కార్మిక హక్కుల ఉల్లంఘనల గురించి తెలుసుకోవడమే లక్ష్యంగా వెళ్ళిన బృంద సభ్యులు మొత్తానికి కార్మికులతో సంబంధాలు పెట్టుకున్నారు, వారిని సంఘటితం చేశారు. కార్మికుల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు యాజమాన్య సంస్థ ఎక్కడికక్కడ సిసిటివి కెమెరాలు పెట్టింది. నిరంతరంగా డ్రోన్లను కూడా ఉపయోగిస్తున్నారు. కార్మికులెవరూ కూడా ఒకరితో మరొకరు మాట్లాడుకోవడానికి కూడా భయపడుతున్నారు.



పోలవరం ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్న కార్మికులతో మాట్లాడుతున్న సిడబ్ల్యుఎఫ్ఐ ప్రతినిధి బృందం

2014లో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చినప్పటికీ ఆదినుండి వివాదాలతో నిండిపోయింది. ప్రధానంగా నిర్వాసితుల సమస్య. లక్షన్నర మందికి పైగా ప్రజలు ఈ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులవుతున్నారు. ఇందులో ప్రధానంగా మూడు రాష్ట్రాలకు చెందిన గిరిజన తెగల ప్రజలున్నారు. ఏళ్లు గడిచినా పునరావాస ప్రక్రియ మందకొడిగా కొనసాగుతూనే వుంది.

కార్పొరేట్లు-రాజకీయ నేతల క్విడ్ ప్రొ కో

పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ల చుట్టూ వున్న పరిస్థితులను గమనిస్తే కార్పొరేట్ అధికారానికి, రాజకీయ ప్రాబల్యానికి మధ్య గల సంబంధాలు ఎంతలా ముడిపడి వున్నాయో బహిర్గతమవుతుంది. రాష్ట్రంలో వైఎస్ఆర్ పార్టీ అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్ మార్పు జరిగింది. ఆ మార్పు కూడా యాధృచ్ఛికం కాదు. ఈ ప్రాజెక్టుకు ప్రైమరీ కాంట్రాక్టర్ అయిన నవయుగ ఇంజనీరింగ్ కంపెనీని అర్ధంతరంగా తప్పించి ఆ బాధ్యతలను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్)కు అప్పగించారు. ఇందుకోసం ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు పెద్ద మొత్తాల్లో నిధులు విరాళంగా అందాయి. ఈ పార్టీల్లో బిజెపి, టిడిపి, వైఎస్ఆర్‌సిపి వున్నాయి. ఫలితంగా వారికి పెద్ద ఎత్తున ప్రభుత్వ కాంట్రాక్టులు అందాయి. కార్మికులను, వారి సంక్షేమాన్ని పణంగా పెట్టి రాజకీయ నాయకులు, కార్పొరేట్ కంపెనీలు స్వలాభాలను చూసుకున్నారు.

వలస కార్మికులే ఎక్కువ... చాలీ చాలని వేతనాలతో దుర్భర జీవనం

ఈ ప్రాజెక్టులో పనిచేసే వారిలో దాదాపు 90శాతం మంది వలస కార్మికులే. బీహార్, జార్ఖండ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల నుండి ఇక్కడకు పనుల కోసం వచ్చినవారే. చాలా దుర్భర పరిస్థితుల్లో వీరు పనులు చేస్తున్నారు. కనీస వేతనాలు వుండవు, చాలా తక్కువ కూలీకే చేయాల్సి వుంటుంది. ఓవర్‌టైమ్ చేసినా దానికి చెల్లింపులు వుండవు, పిఎఫ్ లేదా బీమా సౌకర్యాలు సున్నా. 12గంటలు ఏకధాటిగా పనిచేయాలి. మధ్యలో కేవలం అరగంట మాత్రమే బ్రేక్. వారాంతపు సెలవులు లేవు, చాలామంది ఆదివారాలు కూడా పనిచేయాల్సిందే. కొత్తగా వచ్చిన కార్మికులకు మొదటి ఆరు మాసాలు ఆహారం కూడా సరఫరా చేయరు. తమకు వచ్చే ఆ కొద్ది జీతాల్లోనే వారు కొనుక్కోవాల్సి వుంటుంది. ఆరు నుండి ఎనిమిది మంది ఒకే గదిలో వుండాల్సుంది. ఇరుకిరుకుగా వుండే గదుల్లో, అశుభ్రతకు నెలవైన చోట్ల వారు రోజు గడపాల్సి వుంటుంది. సొరంగాలు తొలచడం, గోడ నిర్మాణం వంటి ప్రమాదకరమైన, ముప్పు ఎక్కువగా వుండే పనులు చేసే కార్మికులకు ఎలాంటి సక్రమమైన భద్రతా వ్యవస్థ వుండదు. సుదీర్ఘ పనిగంటలు, పేలవమైన భద్రతా చర్యల కారణంగా వారు ముప్పు ముంగిట కాలం గడుపుతున్నారు. ఇటీవలనే రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీల చట్టాన్ని సవరించింది. ఈ మార్పుల వల్ల కంపెనీలు లాభపడతాయి గానీ కార్మికుల జీవితాలు మరింత దుర్భరమవుతున్నాయి. ' అని అర్కా రాజ్‌పండిట్ పేర్కొన్నారు.

భారత నావికాదళంలోకి నిస్తార్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖ)

హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ నిర్మించిన డిపి2 డైవింగ్ సపోర్ట్ వెస్సెల్ నిస్తార్ నౌకను మంగళవారం భారత నావికా దళానికి అప్పగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డి 448 పత్రంపై హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సిఎమ్‌డి కమాండర్ హేమంత్ ఖత్రి, కమాండర్ అమిత్ సుబ్రో బెనర్జీలు నేవీ రియర్ అడ్మిరల్ అవినీష్ సెత్ సమక్షంలో సంతకాలు చేశారు. 2020లో ఐఎన్ఎస్ ధ్రువ్‌ను అందజేసిన తర్వాత హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ తయారు చేసిన మరో నౌక నిస్తార్. హేమంత్ ఖత్రి మాట్లాడుతూ హెచ్ఎస్ఎల్ దేశం కోసం అధునాతన యుద్ధ నౌకలను నిర్మించేందుకు కృషి చేస్తోందన్నారు. అమిత్ సుబ్రో బెనర్జీ మాట్లాడుతూ నిస్తార్ అత్యాధునిక సాంకేతికతతో కూడిన స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన నౌక అని తెలిపారు.

కేరళ నర్సు నిమిష ప్రియకు ఉరిశిక్ష ?

కొచ్చి : యెమెన్‌లో హత్య కేసులో చిక్కుకున్న కేరళ నర్సు నిమిష ప్రియకు ఈ నెల 16న ఉరిశిక్ష అమలు చేయనున్నట్లు కొన్ని ఆన్‌లైన్, టెలివిజన్ మీడియా సంస్థలు మంగళవారం వెల్లడించాయి. ఆమె కుటుంబ సభ్యులు, ఆమె విడుదల కోసం ప్రయత్నిస్తున్న కేంద్ర, కేరళ ప్రభుత్వ అధికారులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. 2018 జూన్‌లో యెమెన్‌లో ఒక హత్య కేసులో ప్రియను దోషిగా నిర్ధారించారని, స్థానిక కోర్టు మరణశిక్ష విధించారని వారు తెలిపారు. ప్రస్తుతం ప్రియ సనాలోని సెంట్రల్ జైలులో ఉన్నారు. ప్రియ భర్త టామీ థామస్ మాట్లాడుతూ ఉరిశిక్ష అమలు చేయడం గురించి తమకు ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని చెప్పారు. ప్రియను కాపాడుకునే ప్రయత్నాలు చేయడం కోసం గతేడాది ఏప్రిల్‌కు యెమెన్‌లోని సనాకు ఆమె తల్లి ప్రేమ కుమారి వెళ్లారని, అప్పట నుంచి అక్కడే ఉంటున్నారని థామస్ చెప్పారు. ప్రస్తుతం సనాలో హౌతీ తిరుగుబాటుదారుల ప్రభుత్వం ఉండటంతో భారత, కేరళ ప్రభుత్వాల యత్నాలు ఫలించడం లేదు. కేరళలోని పాలక్కడ్‌కు చెందిన ప్రియ 2008లో యెమెన్‌కు వెళ్లారు. 2015లో యెమెన్ జాతీయుడు తలాల్ అబ్దో మెహదీతో కలిసి సొంతంగా క్లినిక్ ప్రారంభించారు. అభిప్రాయ భేదాలు రావడంతో ప్రియ పాస్‌పోర్టును మెహదీ స్వాధీనం చేసుకున్నాడు. దానిని తీసుకునేందుకు అతనికి మత్తు ఇంజెక్షన్ ఇవ్వగా, అధిక మోతాదు కారణంగా మెహదీ మరణించాడని ప్రియపై హత్య కేసు నమోదైంది.

అంతర్జాతీయ సైబర్ మోసాల సిండికేట్ గుట్టు రట్టు

- సభ్యుడిని అరెస్టు చేసిన సిబిఐ

న్యూఢిల్లీ : బ్రిటన్, ఆస్ట్రేలియా పౌరులను లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్న 'ఫస్ట్ ఐడియా' సిండికేట్‌కి చెందిన కీలక సభ్యుడు నిషాంత్ వాలియాను సిబిఐ నొయిడాలో అరెస్టు చేసింది. అంతర్జాతీయ సైబర్ మోసాలపై సిబిఐ చేపట్టిన ఆపరేషన్ చక్ర-5లో భాగంగా ఈ చర్య తీసుకున్నారు. ఈ సిండికేట్ సభ్యులు ప్రముఖ బహుళ జాతి కంపెనీల సాంకేతిక సిబ్బందిగా నటిస్తూ విదేశీయులను పరిచయం చేసుకుంటారు. వారి కంప్యూటర్లలో సాంకేతిక సమస్య తలెత్తిందని చెబుతూ దాన్ని బాగు చేసే నెపంతో వారి నుండి డబ్బు వసూలు చేస్తారు. తొలుత ఈ సిండికేట్‌పై కేసు నమోదు చేసిన సిబిఐ, బ్రిటన్‌కు చెందిన నేషనల్ క్రైమ్ ఏజెన్సీ, మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్, ఎఫ్‌బిఐలతో కలిసి పనిచేసింది. సిండికేట్ కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో సోదాలు చేయగా, అడ్వాన్స్‌డ్ కాలింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, బాధితులను మోసం చేయడానికి ఉద్దేశించిన స్క్రిప్ట్‌లు, మోసం, బలవంతపు వసూళ్ళకు సంబంధించిన పత్రాలు తదితరాలు లభ్యమయ్యాయని సిబిఐ తెలిపింది.

పహల్గామ్ ఉగ్రదాడి తరువాత విమాన ఛార్జీల పెంపుపై నిలదీసిన పార్లమెంటరీ ప్యానల్

- అహ్మదాబాద్ విమానం ప్రమాదంపై ప్రశ్నలు
- విమానయానశాఖ, ఎయిర్‌లైన్ అధికారులతో ప్యానల్ సమావేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పహల్గామ్ ఉగ్రదాడి తరువాత విమాన ఛార్జీల పెంపుపై పార్లమెంటరీ ప్యానల్ నిలదీసింది. అలాగే అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంపై ప్రశ్నలు గుప్పించింది. కెసి వేణుగోపాల్ నేతృత్వంలోని పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) పౌర విమానయాన మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు, ఎయిర్‌లైన్, ఎయిర్‌పోర్టు ప్రతినిధులతో పార్లమెంటరీ ప్యానెల్ మంగళవారం సమావేశమైంది. ఈ సమావేశంలో ఎయిర్ ఇండియా సిఇఒ, ఎమ్‌డి కాంప్‌బెల్ విల్సన్‌తో సహా అగ్రశ్రేణి ఎయిర్‌లైన్ ప్రతినిధులు హాజరయ్యారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం, విమాన ఛార్జీల పెరుగుదల గురించి ప్యానల్ సభ్యులు ప్రశ్నించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం గురించి, దర్యాప్తు నివేదిక ఎప్పుడు సిద్ధంగా ఉంటుందో ప్రస్తావించారని వర్గాలు తెలిపాయి. ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత శ్రీనగర్ విమాన ఛార్జీల్లో అకస్మాత్తుగా పెరుగుదలపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినట్లు వర్గాలు తెలిపాయి. ఇతర అంశాలతో పాటు, కొంతమంది సభ్యులు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్) ఆడిట్‌ను డిమాండ్ చేశారని వర్గాలు తెలిపాయి.

విమానం బ్లాక్ బాక్స్‌ల విశ్లేషణను పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతుందో సభ్యులలో ఒకరు మంత్రిత్వశాఖ అధికారుల నుండి తెలుసుకోవాలని కోరినట్లు వర్గాలు తెలిపాయి. అలాగే భద్రతా పరమైన విధానాల గురించి ఈ సమావేశంలో ఎంపిలు ప్రశ్నించారని సమాచారం. ఇటీవల వెలుగుచూసిన లోపాలను ఎత్తి చూపారని, తక్షణ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేసినట్లు వర్గాలు పేర్కొన్నాయి. అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విమానం బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ మోడల్ సురక్షితమైదేనని ఎయిరిండియా ప్రతినిధులు తెలిపారు. ఆ మోడల్‌కు చెందిన 100కి పైగా విమానాలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. అయితే విమానం కుప్పకూలిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, అధికారిక దర్యాప్తు నివేదిక కోసం వేచిచూస్తున్నామని అన్నారు. పౌర విమానయాన మంత్రిత్వశాఖ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ), ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఇఆర్ఎ), ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ), ఎఎఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్ (ఎఎఐసిఎల్ఎఎస్), బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్) వంటి అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఎయిరిండియా విమాన ప్రమాదంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక

అహ్మదాబాద్‌లో జూన్ 12న ఎయిర్ ఇండియా-171 విమానం కుప్పకూలిన దుర్ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ఇంతవరకూ జరిపిన దర్యాప్తు ఆధారంగా రూపొందించిన ప్రాథమిక నివేదికను మంగళవారం కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖకు అందజేసింది. అయితే నివేదికలోని సమాచారాన్ని బయటపెట్టలేదు. దీనిని ఈ వారాంతంలో విడుదల చేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విమానం కుప్పకూలిన ప్రాంతంలో సేకరించిన రెండు బ్లాక్ బాక్సులు, అందులోని ఫ్లైట్ డాటా, సిబ్బంది చర్యలు, వాతావరణ పరిస్థితులు, మెకానికల్ పర్ఫార్మెన్స్ తదితర ఆంశాల ఆధారంగా ప్రాథమిక నివేదకను ఎఎఐబి రూపొందించినట్లు ప్రభుత్వ ఉన్నత స్థాయి అధికారులు తెలిపారు. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు జూన్ 12న బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన క్షణాల్లోనే మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కుప్పకూలింది. విమానం మంటల్లో చిక్కుకోవడంతో అందులోని 242 మందిలో 241 మంది అక్కడికక్కడే మరణించారు. మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడటంతో మరో 29 మంది మరణించారు. దీంతో మృతుల సంఖ్య 270కి చేరింది. విమాన ప్రమాదంపై దర్యాప్తునకు ఎఎఐబి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

చైనా వీసా 70 దేశాలకు ఉచితం

- నిబంధనలు సడలింపు
- 30 రోజులకు అనుమతి

బీజింగ్ : చైనా తన వీసా నిబంధనలను సడలించింది. 70 దేశాలకు చెందిన పౌరులకు వీసా అవసరం లేదంటూ అనూహ్య నిర్ణయం తీసుకుంది. 30 రోజులపాటు తమ దేశాన్ని సందర్శించడానికి అనుమతిస్తున్నామని సోమవారం ప్రకటించింది. దీంతో ఆ దేశ పర్యటక సంస్థలు, వ్యాపారులు ఎక్కువ మంది టూరిస్టులు చైనాకు వస్తారని భావిస్తున్నారు. చైనా అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరుచు కోవడానికి, పర్యాటకరంగ అభివృద్ధికి ఈనిర్ణయం తీసుకుంది. కోవిడ్ అనంతరం 1.38 కోట్ల మంది పర్యాటకులు మాత్రమే వచ్చారు, 2024 లో 2 కోట్లు రాగా ప్రస్తుతం రెట్టింపు వస్తారని ప్రభుత్వ వర్గాల అంచనా. 2023 డిసెంబర్‌లో ఫ్రాన్స్ , జర్మని, ఇటలీ , నెదర్లాండ్, స్పెయిన్, మలేషియా దేశాల పౌరులకు వీసా లేకుండా ప్రవేశాన్ని కల్పించింది. ప్రస్తుతం మొత్తం ఐరోపా దేశాలు, ఐదు లాటిన్ అమెరికా దేశాలు , నాలుగు మిడిల్ ఈస్ట్ దేశాలు, ఉజ్బెకిస్తాన్‌లతో పాటు అజర్ బైజాన్‌కు అవకాశం కల్పించనుంది. ఆఫ్రికా దేశాలతో సత్సంబంధాలు న్నప్పటికీ వాటిని మినహాయించింది. ఈ కొత్తవీసా నిబంధన ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తుందని, కొత్త అవకాశాలను కల్పిస్తుందని వైల్డ్ చైనా , ట్రిప్.కాం గ్రూప్ సంస్థలు ప్రకటించాయి.

ప్రపంచానికి చక్రవర్తి అవసరం లేదు!

- ట్రంప్‌పై మండిపడ్డ లూలా డసిల్వా
- చైనా, రష్యా సహా బ్రిక్స్ దేశాల నిరసన

బ్రసీలియా : బ్రిక్స్ దేశాలపై అదనపు టారిఫ్‌లు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికపై బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఇప్పుడు చక్రవర్తి అవసరం లేదని, అమెరికా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయాలను ప్రపంచం కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. గతంలో మాదిరిగా ప్రపంచం ఈనాడు లేదు. అందువల్ల మనకు చక్రవర్తి అవసరం లేదు. అయినా మనవి కూడా సార్వభౌమాధికార దేశాలే, వారు సుంకాలు విధిస్తే మనకూ ఆ హక్కు వుందని లూలా అన్నారు. సోషల్ మీడియాలో సుంకాలతో దేశాలను బెదిరించడం ట్రంప్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఇటువంటి అంశాలపై చర్చించేందుకు సంబంధిత వేదికలు చాలా వున్నాయని అన్నారు. సోమవారంతో ముగిసిన బ్రిక్స్ సదస్సులో డసిల్వా, ట్రంప్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆర్థిక దృక్కోణం నుండి ప్రపంచ దేశాలను సంఘటితపరచడానికి మరో మార్గం కనుగొనాలని కోరుకునే దేశాల కూటమి ఇది.' అని లూలా వ్యాఖ్యానించారు.

ట్రంప్‌పై బ్రిక్స్ దేశాల ఆగ్రహం

బ్రిక్స్ దేశాలు అమెరికా వ్యతిరేక వైఖరిని అవలంబిస్తే



పది శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ చేసిన హెచ్చరికపై బ్రిక్స్ సభ్య దేశాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ట్రంప్ ప్రకటనపై చైనా తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఒత్తిళ్లను పెంచడానికి, బలవంతంగా మెడలు వంచడానికి టారిఫ్‌లను ఒక సాధనంగా వాడరాదని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పష్టం చేశారు. ఏఒక్క దేశాన్ని లక్ష్యంగా చేసుకోవడం బ్రిక్స్ లక్ష్యం కాదని ఆమె పేర్కొన్నారు. అందరికీ సమాన అవకాశాలు, పరస్పర సహకారం వుండాలని కోరుకుంటుందని చెప్పారు.

బ్రిక్స్ పరిధిలో తమ పనితీరు 'సాధారణ ప్రపంచ దృక్పథాన్ని' ప్రతిబింబిస్తుందని క్రెమ్లిన్ పేర్కొంది. తృతీయ ప్రపంచ దేశాలకు ఎన్నడూ వ్యతిరేకంగా వుండదని స్పష్టం చేసింది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా స్పందిస్తూ మరే ఇతర శక్తితోనూ పోటీపడాలని బ్రిక్స్ కోరుకోదని అన్నారు.

గాజాను ఖాళీ చేయించే ప్రతిపాదనపై చర్చ

- ట్రంప్‌తో నెతన్యాహూ మంతనాలు
- ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలన్న ఇజ్రాయిల్ నేత

గాజా/వాషింగ్టన్ : గాజాలో నిత్యం రక్తపాతం సృష్టించి, చిన్నారులుసహా అమాయకులను బలిగొంటున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తనకు మద్దతిస్తూ... నరమేధానికి సహకరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ప్రతిపాదించారు. ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తున్నానంటూ లేఖ రాసి, అమెరికా అధ్యక్షుడికి అందజేశారు. ప్రస్తుతం వాషింగ్టన్‌లో పర్యటిస్తున్న నెతన్యాహుతో శ్వేతసౌధంలో ట్రంప్ చర్చలు జరిపారు. పాలస్తీనియన్లను గాజా నుండి బలవంతంగా ఖాళీ చేయించి, పొరుగు దేశాలకు తరలించేందుకు ఉద్దేశించిన వివాదాస్పద ప్రతిపాదనపై డొనాల్డ్ ట్రంప్, బెంజమిన్ నెతన్యాహు చర్చించినట్లు తెలుస్తోంది.

ట్రంప్, నెతన్యాహూ మధ్య శ్వేతసౌధంలోని బ్లూ రూమ్‌లో విందు సమావేశం జరిగింది. పాలస్తీనాకు మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు అమెరికా, ఇజ్రాయిల్ ఇతర దేశాలతో కలిసి పని చేస్తున్నాయని నెతన్యాహు




చెప్పారు. గాజాలో నివసిస్తున్న వారు పొరుగు దేశాలకు తరలిపోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. 'గాజాలోనే ఉండాలని అనుకుంటే ఉండొచ్చు. కానీ వారు బయటకు వెళ్లాలనుకుంటే వెళ్లే అవకాశం కల్పించాలి. అది జైలులా ఉండకూడదు. ఒక బహిరంగ ప్రదేశంలా ఉండాలి. ప్రజలకు స్వేచ్ఛగా అవకాశం కల్పించాలి' అని చెప్పుకొచ్చారు. ట్రంప్‌తో సమావేశం సందర్భంగా నెతన్యాహు ఆయనకు ఒక లేఖ అందజేశారు.

ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తున్నానని ఆ లేఖలో నెతన్యాహూ తెలియజేశారు. దీనిపై నెతన్యాహూకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. అణు కార్యక్రమంపై చర్చించేందుకు ఇరాన్ అధికారులు తమను సంప్రదిస్తున్నారని ట్రంప్ చెప్పారు.

ఇజ్రాయిల్ దాడుల్లో మరో 49మంది మృతి

ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరుగుతుండగానే మరోవైపు గాజాపై ఇజ్రాయిల్ దళాల నరమేధం కొనసాగుతోంది. గత 24 గంటల్లో గాజాలో ఇజ్రాయిల్ జరిపిన దాడులలో 49మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా, 262 మంది గాయపడ్డారు. మృతులలో సహాయం కోసం ఆహార శిబిరాల వద్దకు వచ్చిన ఎనిమిది మంది అన్నార్తులు కూడా వున్నారు.

విడుదల చేసిన ఆరుగురు పాలస్తీనా బందీలను ఇజ్రాయిల్ చంపేసిందని హమాస్ సీనియర్ నేత అబ్దుల్ కరీం హనిని తెలిపారు. సెంట్రల్ గాజాలోని అల్ - అఖ్సా ఆస్పత్రిలో తీవ్రమైన ఇంధన కొరత ఏర్పడింది. దీని ప్రభావం అనేక వార్డులపై పడుతోంది. మరోవైపు ఉత్తర గాజాలో మంగళవారం జరిగిన పేలుడులో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోగా, 14 మంది గాయపడ్డారు. యెమెన్‌లో హౌతీలు ఎర్ర సముద్రంలో మరో నౌకను ధ్వంసం చేశారు. అందులోని గ్రెనేడ్లను లక్ష్యంగా చేసుకొని హౌతీలు ఈ దాడి జరిపారు.



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందచేస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు

మామిడి రైతులకు అండగా నిలవండి

- శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరిన రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా తోతాపురి మామిడిని పండించిన రైతులకు కేంద్రం అండగా నిలబడాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. మంగళవారం నాడిక్కడ కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో చర్చించారు. వ్యవసాయరంగ సమగ్ర అభివృద్ధికి సహకారం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు. ముఖ్యంగా రాష్ట్రంలో తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. 6.5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి పంట కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.260 కోట్లు ఖర్చు చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం తగిన తోడ్పాటును అందించాలని కోరారు. వెనుకబడిన జిల్లాల కోసం మైక్రో ఇరిగేషన్ పథకానికి రాయితీ పెంచాలని కోరారు. ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ తరహాలో ఎపికి కేంద్రం అదనపు సాయం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, రైతుల ప్రయోజనాన్ని కాపాడటానికి, ధర పతనం అయిన నేపథ్యంలో మార్కెట్ మద్దతు పథకం (ఎంఐఎస్) కింద ఆర్థిక సహాయం రూ.260 కోట్లు విడుదల చేయాలని కోరారు. గుంటూరులో మిర్చి బోర్డు, శ్రీకాకుళంలో జీడిపప్పు బోర్డు, చిత్తూరులో మామిడి బోర్డును ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని వివరించారు. విభజన చట్టం ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.

15న జీడిపల్లికి నీళ్లు

(మొదటిపేజీ తరువాయి)

కోట్లతో హంద్రీనీవా కాలువల విస్తరణ కాలువ లైనింగ్ పనులు తాము చేపట్టామని తెలిపారు. ఈ నెల 30 నాటికి కుప్పానికి నీళ్లు తీసుకెళ్లేందుకు శ్రీకారం చుట్టామన్నారు. పోలవరం నుంచి బనకచర్లకు నీళ్లు వస్తే కరువు ఉండదని తెలిపారు. గోదావరి నుంచి రెండువేల టిఎంసిల నీరు సముద్రంలోకి వృథా పోతోందన్నారు. ఇందులో 200 టిఎంసిలు మన రాష్ట్రం, 100 నుంచి 200 టిఎంసిలు తెలంగాణ వాడుకోగలిగితే రెండు రాష్ట్రాలకూ ఉపయోగం ఉంటుందన్నారు.

సాగునీటి సంఘాలకు పూర్తి అధికారాలు, నిధులు

సాగునీటి సంఘాలకు పూర్తి అధికారాలు, నిధులు ఇస్తామని చంద్రబాబు తెలిపారు. ఆయకట్టు రైతులకే పెత్తనం ఇవ్వాలని సాగునీటి సంఘాలను ఏర్పాటు చేశామని, వాటి ద్వారా భూగర్భ జలాలు పెంచే బాధ్యత తీసుకుంటామని అన్నారు. ప్రపంచమంతా తృణధాన్యాల వైపు వెళ్తోందని, పండ్లకు కూడా డిమాండ్ ఏర్పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. పండ్లు పండించేందుకు రాయలసీమ ప్రాంతం అనుకూలమైనదన్నారు. రాయలసీమలో స్టీల్‌ప్లాంట్ వస్తుందని, కొప్పర్తి ఓర్వకల్ ఇండస్ట్రియల్ పార్క్, లేపాక్షి ఇండస్ట్రియల్ హబ్, గ్రీన్ ఎనర్జీ, టూరిజం, సోలార్, విండ్, హైడల్ ఎనర్జీ ప్రాజెక్టులు వస్తాయని వివరించారు. సూళ్లూరుపేటలో ఏరోసిటీ వచ్చి ప్రైవేటు పెట్టుబడులు సమకూరుతాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఆదాయం పెంచుతున్నామని తెలిపారు. మహిళలు జిల్లాలో ఎక్కడ తిరగాలన్నా ఆగస్టు 15 నుండి ఫ్రీ బస్ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీశైలం డ్యామ్ ఎగ్జిబిషన్‌ను సిఎం చంద్రబాబుకు ఇరిగేషన్ అధికారి వివరించారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా శ్రీశైలం జలాశయాన్ని, నదీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, బిసి జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూఖ్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, జయసూర్య, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జలవనరుల శాఖ సిఇ ఎస్.కబీర్ బాషా, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లలో సిసి కెమెరాలపై హైకోర్టు సందేహం

(మొదటిపేజీ తరువాయి)

యోగేష్ 2019లో వేసిన పిల్‌ను మంగళవారం జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలో 1,392 పోలీస్ స్టేషన్లు ఉంటే 1,001 స్టేషన్లలో మాత్రమే సిసి కెమెరాలు ఉన్నాయని పిటిషనర్ వాదన. లాకప్‌లున్న అన్ని పిఎస్‌లలో ఏర్పాటు చేశామని ప్రభుత్వ వాదన. లాకప్‌లు లేనిచోట కెమెరాలు పెట్టలేదని చెప్పింది. విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

నేడు సార్వత్రిక సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

డ్రైవర్లు, మత్స్యకారులు తదితర వృత్తులలో ఉన్న వారిని నమోదు చేసుకొని వారికి పెన్షన్‌తో పాటు సమగ్ర సామాజిక భద్రత కల్పించాలి. పాత పెన్షన్ పథకాన్ని (ఓపిఎస్)ను పునరుద్ధరించాలి. జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్), ఏకీకృత పెన్షన్ పథకాన్ని (యూపిఎస్) రద్దు చేయాలి' అని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

హామీ ఇచ్చిన వ్యవసాయోత్పత్తుల సేకరణతో అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు సీ2 ప్లస్ 50 శాతం వద్ద కనీస మద్దతు ధరను నిర్ణయించాలి. ఎరువులు, విద్యుత్ తదితరాలపై రైతులకు చట్టపరమైన హామీతో ఇన్‌పుట్ సబ్సిడీని పెంచాలి. సమగ్ర రుణ మాఫీ, పంట బీమా పథకాలు అమలు చేయాలి. చారిత్రక రైతుల ఆందోళనను నిలిపివేసిన సమయంలో ఎస్‌కేఎంకు కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలి' అని కార్మిక, కర్షక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 'రాజ్యాంగం యొక్క కీలక విలువలైన భావ ప్రకటనా స్వేచ్ఛ, అసమ్మతిని తెలియజేసే హక్కు, మత స్వేచ్ఛ, విభిన్నమైన సంస్కృతులు, భాషలు, చట్టం ముందు సమానత్వం, దేశ ఫెడరల్ వ్యవస్థ తదితరాలపై దాడులు జరగకుండా నిరోధించాలి' అని కార్మిక, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సార్వత్రిక సమ్మెలో 30-40 కోట్ల మంది కార్మికులు, రైతులు భాగస్వాములవుతారని కేంద్ర కార్మిక సంఘాల నేతలు తెలిపారు. సమ్మెకు సన్నాహకాలు పూర్తయ్యాయని, కేంద్రం ముందుంచిన 17 డిమాండ్ల ఛార్టర్‌కు అందరి ఆమోదం లభించిందని వారు న్యూఢిల్లీలో విలేకరులకు చెప్పారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

(మొదటిపేజీ తరువాయి)


పాటు ప్రార్థనల తర్వాత వైఎస్ఆర్ ఘాట్‌కు తల్లి విజయమ్మ, సతీమణి భారతిలతో కలిసి పూలమాలతో నివాళులర్పించారు. ఆ తర్వాత సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడే ఉన్న వైసిపి నేతలు, నాయకులు, కార్యకర్తలతో సెల్ఫీ తీసుకొని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తల్లి విజయమ్మను ప్రేమతో ఆలింగనం చేసుకొని ఆమె దీవెనలను తీసుకున్నారు. అనంతరం ఇడుపులపాయలోని గెస్ట్‌హౌస్‌కు వెళ్లి అక్కడ నుండి పులివెందులకు బయలుదేరి వెళ్లారు.

వైఎస్ఆర్ ఘాట్ వద్ద నుండి జగన్ వెళ్లిపోయిన కొద్ది నిమిషాల్లోనే అక్కడికి తన తల్లి విజయమ్మ, పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డితో కలిసి వైఎస్.షర్మిల వచ్చారు. తల్లి విజయమ్మతో కలిసి ప్రార్థనల తర్వాత వైఎస్ఆర్ ఘాట్‌కు నివాళు లర్పించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడికి వచ్చిన నాయకులను పేరుపేరునా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని వారితో సెల్ఫీలు దిగారు. అనంతరం అక్కడి నుండి గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు.

జగన్‌ను కలిసిన ఆర్కిటెక్చర్ విద్యార్థులు

జగన్‌ను ఆర్కిటెక్చర్ విద్యార్థులు కలిసి తమ సమస్యలను వివరించారు. వారి సమస్యలపై పోరాడుతానని ఈ సందర్భంగా విద్యార్థులకు జగన్ హామీ ఇచ్చారు. ఆయన వెంట వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రాజంపేట, బద్వేలు ఎమ్మెల్యేలు అమర్నాథ్‌రెడ్డి, సుధా, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు అంజాద్‌బాషా, గండికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డి ఉన్నారు.

నవ్విన నాపచేను



బంటీ నాలుగో తరగతి చదువుతున్నాడు. చదువులోనే కాదు ఆటపాటల్లోనూ చురుకైన పిల్లాడు. ఏడాది వయసులో అన్నం తినేందుకు మారాం చేస్తుంటే వాళ్లమ్మ సెల్‌ఫోన్‌లో వీడియోలు చూపిస్తూ తినిపించేది. రానురాను అది అలవాటుగా మారింది. ఇలా అయితే లాభం లేదనుకున్న బామ్మ ఓరోజు వాడినుంచి ఫోన్ లాక్కుని పక్షులు, జంతువులు, పూలు, పండ్లు, రకరకాల ఫోన్లు, ఆట వస్తువులు బొమ్మలున్న రంగుల పుస్తకాన్ని చేతికిచ్చింది. వాడు పేజీలను తిప్పుతూ సంతోషంగా కేరింతలు కొట్టాడు. అలా రోజుకొక పుస్తకం ఇస్తూ బడికెళ్లే సమయానికి లోకజ్ఞానం పెంపొందించింది.

బొమ్మల పుస్తకాలతో మొదలైన బంటీ ప్రస్థానం, వయసు పెరుగుతున్నకొద్దీ శతక పద్యాలు, నీతి కథలు చదివేంతవరకు చేరింది. వాడి ప్రతి పుట్టిన రోజుకూ అమ్మానాన్నలతో పాటు బామ్మ, స్కూల్లో టీచర్లు తలా ఒక పుస్తకం కానుకగా ఇచ్చేవారు. ఒక రోజు సామెతల పుస్తకం చదువుతూ.. బామ్మ వద్దకు వెళ్లి 'నవ్విన నాపచేను పండడం అంటే ఏమిటి?' అని ప్రశ్నించాడు. దానికి ఆవిడ ఉదాహరణ సహితంగా చెబుతానంది.

పెరట్లోకి తీసుకెళ్లి మునగ చెట్టుపై పాకుతున్న నల్లని గొంగళి పురుగును చూపించింది. దాన్ని చూసి, తొలుత నవ్వి, తర్వాత ఛీ.. అని అసహ్యించుకున్నాడు. ఇంకోరోజు గొంగళిపురుగు మెల్లగా పాకుతూ కిటికీ పైన గూడు కట్టడాన్ని చూపింది. అలా నెలరోజుల పాటు ఇద్దరూ ఆ గూడును గమనిస్తూ వచ్చారు. ఒకరోజు వారు చూస్తుండగానే గూటిని చీల్చుకుని రంగురంగుల సీతాకోకచిలుక ఎగురుతూ బయటకు వచ్చింది. హే..హే.. అని గట్టిగా అరుస్తూ.. దాని వెనకాలే పరిగెత్తాడు బంటీ. బామ్మ వాడిని పక్కన కూర్చోబెట్టుకుని ఇలా చెప్పింది.


'గొంగళిపురుగు రూపాన్ని అంతా అసహ్యించుకుంటారు. కాని అది ఒక దశ దాటిన తరువాత గూట్లోకి వెళుతుంది. అక్కడ లార్వా, ప్యూపా దశల్ని అధిగమించి చివరికి అందమైన సీతాకోకచిలుకలా మారుతుంది. అప్పుడు దాన్ని అందరూ స్వాగతిస్తారు. 'నవ్విన నాపచేను పండడం అంటే ఇదే' అని బామ్మ చెబుతుంటే.. 'ఓహో అలాగా..' అంటూ ఆశ్చర్య పోవడం బంటీ వంతయ్యింది.

- శర్మ సీహెచ్, విజయవాడ, 94405 87567.

చుక్కలు కలపండి



పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న ఆంగ్ల అక్షరాలను ఒకదాని తరువాత ఒకటి కలుపుతూ వెళితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి..



నేను గీసిన బొమ్మ



రత్నాల రేష్మాంజలి, 8వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్ రాజపురం, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా.





పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com




రోషిణి రెస్పాన్స్ అదుర్స్..

బాత్‌రూమ్‌లో బల్లి ఉందంటే కొందరు దాన్ని తరిమేదాకా అటువైపు వెళ్లరు. అటకపై నుంచి ఎలుక మీద పడితే ఎగిరి గంతేస్తారు. ఇక బల్లి పడితే అంతే సంగతులు. అలాంటివారంతా కేరళకి చెందిన రోషిణి అనే ఓ మహిళా ఫారెస్ట్ ఆఫీసర్ చేసిన సాహసం తెలుసుకుంటే 'ఔరా' అని నోరెళ్లబెడతారు. అడవిలో ఓ నీటి మడుగు దగ్గర తిరుగుతున్న 15 అడుగులు, 20 కేజీల బరువున్న కింగ్ కోబ్రాను, ఆమె ఎంతో చాకచక్యంగా పట్టుకున్న వీడియో ఆదివారం నుండి సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. రోషిణి కెరియర్‌లో కింగ్ కోబ్రాని పట్టుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఆమె ఇప్పటి వరకు 800కి పైగా సరీసృపాలను సంరక్షించారు. విషం ఉన్నవి, లేనివి కూడా అందులో ఉన్నాయి.



తిరువనంతపురానికి చెందిన జిఎస్ రోషిణి బీట్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఐదుగురు సభ్యులున్న రాపిడ్ రెస్పాన్స్ టీమ్ (ఆర్‌ఆర్‌టి)లో ఆమె ఒకరు. ఆదివారం ఉదయం అంచుమరుత్తుముదు దగ్గర ఓ సన్నని నీటి మడుగులో పెద్ద పాము కనిపించిందని స్థానికులు ఆర్‌ఆర్‌టికి సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న రాపిడ్ బృందం అక్కడికి వెళ్లారు. ఒక నల్ల సంచి, ఒంపు తిరిగిన రెండు ఇనుప చువ్వలను తీసుకుని రోషిణి ముందుకు కదిలారు. ఒక చువ్వకి సంచి తగిలించి, రెండో చువ్వతో పాముని అదిలిస్తున్న రోషిణిని చూస్తుంటే ఏదో ఎలుకనో, పిల్లినో అదిలిస్తున్నట్లు ఉంది. బుసలు కొడుతున్న ఆ పాము ఎంతకీ రోషిణికి లొంగడం లేదు. మధ్యలో రెండు, మూడు సార్లు ఆమె చేతిలో నుండి ఇనుప చువ్వలు కింద పడిపోయాయి. అయినా రోషిణి వెనక్కి తగ్గలేదు. ఒక సందర్భంలో అయితే దాన్ని బతిమిలాడుతున్నట్లు 'ప్లీజ్, ప్లీజ్' అంటున్న రోషిణి మాటలు కూడా వీడియోలో వినిపించాయి. ఒకానొక దశలో ఎంతకీ సంచిలోకి వెళ్లకుండా మొరాయించిన కోబ్రా తోకని చేతితో పట్టుకుని దాన్ని వెనక్కి లాగిన విజువల్స్ కూడా వీడియోలో ఉన్నాయి. చాలా ప్రయత్నాల తరువాత కోబ్రా రోషిణి వలకి చిక్కింది. వైరల్ అయ్యిన ఈ వీడియో ద్వారా ఆమెని వెళ్లి కలిసిన మీడియా మిత్రులకు ఇదంతా సర్వ సాధారణమని నవ్వుతూ రోషిణి ఇలా సమాధానం చెప్పారు. 'మధ్యాహ్నం 12:30కి పాముని పట్టుకున్నాం. ఆ తరువాత దాన్ని దట్టమైన అడవి



లోకి పంపేశాం. ఇదంతా విధుల్లో భాగం. ఇందులో నేను ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదు' అన్నారు.

అయితే వైరల్ అయిన రోషిణి వీడియోకి చాలామంది ఆమెని ప్రశంసిస్తూ పోస్టులు పెట్టారు. కొంతమందైతే చాలా ప్రమాదకర పరిస్థితుల్లో సాహసం చేశారని, రక్షణ పరికరాలు లేకుండా ఎప్పుడూ ఇలా చెయ్యొద్దని హెచ్చరించారు. ఏదేమైనా రోషిణి చేసిన సాహసం ఇప్పుడు నెట్టింట పెద్ద చర్చకి దారితీసింది.

కలుషిత ఆహారాన్ని తినొద్దు

మనం తీసుకునే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. శరీరానికి సరైన పోషకాలు అందించకపోతే చాలా రకాల ఇబ్బందులు తలెత్తుతాయి. ఏటేటా ప్రపంచ వ్యాప్తంగా కలుషిత ఆహారం సమస్య తీవ్రమవుతోంది. ప్రపంచ జనాభాను కలుషిత ఆహారం తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. మన దేశంలో 527 రకాల ఆహారాలు కలుషితం అవుతున్నాయని వివిధ నివేదికలు పేర్కొంటున్నాయి.

ఆహారం ఎలా కలుషితం అవుతుందంటే...

ఆహార ఉత్పత్తుల్లోకి బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు, రసాయనాలు లేదా టాక్సిన్లు వంటి హానికరమైన పదార్థాలు, జీవులు ప్రవేశిస్తూ అవి కలుషితమవుతాయి. ప్రాసెసింగ్, రవాణా, స్టోరేజ్ వంటి ఏదో ఒక దశలో ఆహార ఉత్పత్తులు కలుషితం అవుతున్నాయి. మనదేశంలో కలుషితమవుతున్న ఆహారాల జాబితాలో ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాల ఉత్పత్తులు, మాంసం, సుగంధ ద్రవ్యాలు, ప్యాక్డ్ స్నాక్స్ వంటివి ఉన్నాయి. ఈ ఆహారాలు వివిధ రోగ కారకాలు లేదా రసాయనాలతో కలుషితం కావొచ్చు. వీటిని ఆహారంగా తీసుకుంటే రోగాల తీవ్రత పెరుగుతుంది.



పరిశుభ్రత పాటించకపోవటమే కారణం

ఆహారం కలుషితం కావటానికి అనేక కారణాలున్నాయి. పారిశుధ్యం లేకపోవటం, సరైన పరిశుభ్రత పద్ధతులు పాటించకపోవటం, ఫుడ్ ప్రాసెసింగ్ సరిగ్గా చేయకపోవటం, నిల్వ, రవాణా సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవటం కూడా ప్రధాన కారణాలే. అలాగే పురుగు మందుల అధిక వినియోగం వల్ల కూడా ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయి.

అనారోగ్య పరిస్థితులు

కలుషిత ఆహారాన్ని తింటే అనేక రకాల రోగాల బెడద ఉంటుంది. కడుపులో అసౌకర్యం, వాంతులు, విరేచనలు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు వేధించొచ్చు. కొన్ని సందర్భాల్లో తీవ్ర అనారోగ్యం వంటి వాటికి దారితీయొచ్చు. ఇంకొన్ని సందర్భాల్లో ప్రాణాపాయ పరిస్థితులు నెలకొంటాయి. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలకు కలుషిత ఆహారంతో హెల్త్ రిస్క్ అధికంగా ఉంటుంది.

కఠిన నిబంధనలు అవసరం

ఆహార భద్రతతోపాటు కలుషిత పదార్థాలను నివారించటంలో ప్రభుత్వాల పాత్ర కీలకం. ఆహార ఉత్పత్తి, ప్రాసెసింగ్, పంపిణీ ప్రక్రియల్లో కఠినమైన నిబంధనలు, ప్రమాణాలను తూచా తప్పకుండా అమలుచేయాలి. ఆహార భద్రతా ప్రమాణాలను నిర్వహించటానికి ఆహార సంస్థలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తుండాలి. ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆహార భద్రతపై ప్రభుత్వాలు, ప్రజా సంఘాలు ప్రజలకు అవగాహన కల్పించాలి. దీనికోసం అన్ని ప్రాంతాల్లో వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహించాలి.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే.

- తినడానికి ముందు పండ్లు, కూరగాయలు వంటి వాటిని బాగా కడగాలి.
- హానికర బ్యాక్టీరియాను చంపడానికి మాంసం, పౌల్ట్రీ, సీఫుడ్‌లను బాగా ఉడికించాలి.
- పరిశుభ్రమైన పరిసరాల్లో ఆహారాన్ని సరిగ్గా నిల్వ చేయాలి.
- పచ్చి లేదా సరిగా వండని ఆహారాలను తినకపోవటమే మంచిది.
- ప్యాక్డ్ లేదా ప్రాసెస్ చేసిన ఆహారాలను కొనుగోలు చేసేటప్పుడు లేబుల్స్ జాగ్రత్తగా పరిశీలించాలి.
- వైద్య, ఆరోగ్యశాఖాధికారులు సూచించిన ఆహార భద్రత మార్గదర్శకాలను పాటించాలి.

గేయ రచయిత శివశక్తి దత్త కన్నుమూత

సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఇంట విషాదం చోటు చేసుకుంది. ఆయన తండ్రి కోడూరి శివశక్తి దత్త మణికొండలోని తన నివాసంలో సోమవారం రాత్రి కన్నుమూశారు. గేయ రచయిత, స్క్రీన్ రైటర్‌గా ఆయన టాలీవుడ్‌లో మంచి గుర్తింపు పొందారు. శివశక్తి దత్త అసలు పేరు కోడూరి సుబ్బారావు, అక్టోబర్ 8 1932లో కొవ్వూరులో జన్మించారు. కళలపై ఆసక్తి ఉన్న ఆయన.. ముంబయిలోని ఓ ఆర్ట్స్ కాలేజీలో చేరారు. కమలేశ్ అనే కలం పేరుతో చిత్రకారుడిగా పనిచేశారు. ఆ తర్వాత సంగీతంపై ఇష్టంతో గిటార్, సితార్, హార్మోనియం నేర్చుకున్నారు. నాగార్జున నటించిన 'జానకిరాముడు' చిత్రానికి



స్క్రీన్‌రైటర్‌గా, పని చేసిన ఆయన 2007లో 'చంద్రహాస్' చిత్రాన్ని డైరక్ట్ చేశారు. గేయ రచయితగా టాలీవుడ్‌కి ఎన్నో హిట్స్ సాంగ్స్ ఇచ్చారు. 'సై' సినిమాల్లో 'నల్లా నల్లాని కళ్ల' పాట నుంచి ఛత్రపతి 'మన్నేల తింటివిరా', రాజన్న 'అమ్మా అవని' గతేడాది వచ్చిన హనుమాన్ థీమ్ సాంగ్ వరకూ ఎన్నో హిట్ పాటలకు సాహిత్యం అందించారు. బాహుబలి 1 'మమతల తల్లి', 'ధీవర', బాహుబలి 2 'సాహోరే బాహుబలి', ఎన్టీఆర్ : కథానాయకుడు కథానాయక, ఆర్‌ఆర్‌ఆర్, రామం రాఘవమ్, హనుమాన్ అంజనాద్రి థీమ్, పాటలను ఆయనే రాశారు. శివశక్తి దత్తాకు ముగ్గురు సంతానం. కీరవాణి, కల్యాణి మాలిక్, శివశ్రీ కంచి. సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ ఆయన తమ్ముడు. శివశక్తి దత్త మరణంతో చిత్ర పరిశ్రమ సంతాపం తెలిపింది. సినీ ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.



నవంబరు 7న 'ఏక్‌దిన్' విడుదల

బాలీవుడ్ హీరో అమిర్‌ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఏక్ దిన్' ఈ సినిమాతో సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ సినిమాను నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమాని అమిర్‌ఖాన్‌తో పాటు బాలీవుడ్ నిర్మాత మన్సూర్ ఖాన్ నిర్మిస్తున్నారు.

'పోలీస్ వారి హెచ్చరిక' ట్రైలర్ లాంచ్

అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మాతగా తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంలో రూపొందిన 'పోలీస్ వారి హెచ్చరిక' ట్రైలర్‌ను ప్రముఖ సినీ పెద్దల సమక్షంలో విడుదల చేశారు. ఈనెల 18న ఈ సినిమా విడుదల కానుంది. కిషన్‌సాగర్, నళినీ కాంత్ సినిమాటోగ్రాఫర్స్‌గా పనిచేశారు. గజ్వేల్ వేణు సంగీతాన్ని అందించారు. శివ శర్వాణి ఈ చిత్రానికి ఎడిటింగ్ వర్క్ చేశారు. కెవిల్ దామోదర్‌ప్రసాద్ మాట్లాడుతూ ఆర్మీ నుండి వచ్చిన నిర్మాత జనార్ధన్ ఈ సినిమాను ఎంతో బాగా తీశారనీ, మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. నటి ఇంద్రజ మాట్లాడుతూ సమాజానికి మంచి సందేశం అందించాలనే లక్ష్యంతో తీసిన ఈ సినిమా ఖచ్చితంగా హిట్ అవుతుందన్నారు. నటుడు శుభలేఖ సుధాకర్, దర్శకుడు సముద్ర, నిర్మాత బెల్లి జనార్ధన్, దర్శకుడు బాబ్జి మాట్లాడారు. ఈ సినిమాలో సన్నీ అఖిల్, అజయ్‌ఘోష్, రవి కాలే, షాయాజీ షిండే, శుభలేఖ సుధాకర్ కాశీ విశ్వనాథ్, జబర్దస్త్ వినోద్, పవన్, శాంతి స్వరూప్, హిమజ, శంకరాభరణం తులసి, జయ వాహిని, మేఘనా ఖుషి తదితరులు నటించారు.



'నన్ను బాగా ట్రోల్ చేశారు'



'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు విజయ్ దేవరకొండ తాజాగా ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో గతంలో తను ప్రస్తావించిన ట్యాగ్ అంశంపై స్పందించారు. 'ఆ ట్యాగ్ ఇతర హీరోలతో పాటు వారి అభిమానులకు ఎవరికీ ఇబ్బంది కలిగించకూడదని, తన పేరు ముందు 'ది' ఉపయోగించడం సరికాదనే నిర్ణయం తీసుకున్నట్లు మరోసారి విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. 'లైగర్ సమయంలో నా పేరు ముందు ఒక ట్యాగ్‌లైన్ చేరుస్తున్నట్లు నా టీమ్ ఒత్తిడి చేసింది. నాకు ఆ ట్యాగ్ అక్కర్లేదు అంటూ వారికి చెప్పాను. దానిని చాలా కాలం పాటు వారితో ప్రతిఘటించాను. నా పేరుతోనే నాకు పేరు రావాలని మాత్రమే కోరుకున్నాను. కానీ మీడియాలో అప్పటికే సౌత్ సెన్సేషన్, రౌడీ స్టార్ వంటి ఇతర ట్యాగ్‌లైన్స్ నా పేరు ముందు చేరిపోయాయి' అని ఆయన గుర్తు చేసుకున్నారు. తనను విజయ్ దేవరకొండ అని మాత్రమే పిలవమని కోరానన్నారు. 'నా పేరుకు ముందు 'ది' అనే పదం జోడించడం వల్ల విపరీతమైన వ్యతిరేకత వచ్చింది. చాలామంది హీరోలకు తమ పేరుకు ముందు ట్యాగ్ లైన్స్ ఉన్నాయి. ఇలాంటి ట్యాగ్ వల్ల ఇతర ఏ హీరోలకు తగలనన్ని ఎదురుదెబ్బలు నాకు మాత్రమే తగిలాయి. ప్రస్తుతం చిత్రపరిశ్రమలో ఉన్న వారికి యూనివర్సల్ స్టార్ నుండి పీపుల్స్ స్టార్ వరకు ఏ పేరు అయినా ఉండవచ్చు తప్పు లేదు. నాకంటే చిన్నవారు, నాకంటే పెద్దవారు, నాకంటే ముందు అరంగేట్రం చేసినవారు ఇలా ప్రతి ఒక్కరికీ ఒక ట్యాగ్‌లైన్ ఉంటుంది. బహుశా నాకు మాత్రమే అలాంటివి లేవు. ఇలా మరెవరికీ ఎదురుదెబ్బ తగలకూడదు' అని ఆయన అన్నారు.

ఇక్కడే కొట్టెయ్యాలి

- సిరీస్‌పై టీమిండియా చూపు
- నేడు ఇంగ్లండ్ మహిళలతో నాల్గో టి20
- రాత్రి 11.00గం॥ల నుంచి



మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి రెండు టి20ల్లో ఘన విజయం సాధించిన భారతజట్టు నిర్ణయాత్మక మూడో టి20లో గెలుపుముంగిట బోల్తా పడింది. లండన్ వేదికగా జరిగిన మూడో టి20లో కేవలం 5పరుగుల తేడాతో ఓడిన హర్మన్‌ప్రీత్ సేన ఇక సిరీస్‌పై గురిపెట్టింది. మాంచెస్టర్ వేదికగా జరిగే నాల్గో టి20లో గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కొట్టేయాలన్న దృఢ నిశ్చయంతో ఉంది. నాటింగ్‌హామ్ వేదికగా జరిగిన తొలి టి20లో ఏకంగా 97 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. బ్రిస్టల్ మ్యాచ్‌లో 24పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. బుధవారం జరిగే నాల్గో టి20లో టీమిండియా అన్ని విభాగాల్లో సమిష్టిగా రాణిస్తే విజయం ఖాయం. ఓపెనర్లు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, జెమిమా రోడ్రిగ్స్ తోపాటు ఆల్‌రౌండర్లు హర్మన్‌ప్రీత్, అమన్‌జ్యోత్ కౌర్ బ్యాటింగ్‌లో రాణిస్తే విజయం ఖాయం. వికెట్ కీపర్ రిచా ఘోష్ కూడా ఫామ్‌లో ఉండడం మనకు కలిసొచ్చే అంశం. బౌలింగ్ విభాగంలో తెలుగమ్మాయి శ్రీచరాణి అద్భుత ఫామ్ లో ఉండగా.. పేసర్లు అమన్‌జ్యోత్ కౌర్, అరుంధతి రెడ్డి పేస్ భారాన్ని మోయనున్నారు. స్పిన్నర్లు స్నేహ్ రాణా, రాధా యాదవ్, దీప్తి శర్మ గెలుపు ఖాయం.

వన్డే జట్టులో సీవర్ బ్రంట్‌కు చోటు

భారత్‌తో టి20 సిరీస్ ముగిసిన అనంతరం జరిగే వన్డే సిరీస్ కోసం ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డు తమ మహిళల జట్టును ప్రకటించింది. గాయంతో టి20 సిరీస్ దూరమైన కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ ఫిట్‌నెస్ సాధించింది. భారత జట్టుతో జరగబోయే మూడు వన్డేల కోసం సెలెక్టర్లు మంగళవారం జట్టును ప్రకటించారు. 15మందితో కూడిన బృందంలో నంబర్-1 బౌలర్ ఎకిల్‌స్టోన్, బౌచర్ చోటు దక్కించుకున్నారు. టీమిండియా, ఇంగ్లండ్‌ల మధ్య మూడు వన్డేల సిరీస్ సౌథాంప్టన్ వేదికగా జూలై 16న ప్రారంభం కానుంది. 19న లార్డ్స్, 22న చెస్టర్ లీ స్ట్రీట్‌లో తదుపరి రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక ఐదు టి20ల సిరీస్‌లో భారత్ రెండు మ్యాచుల్లో జయభేరి మోగించి నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5 వికెట్లతో ఓటమి పాలైంది. టి20 మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జూలై 9న, బర్మింగ్‌హామ్‌లో 12న ఐదో మ్యాచ్ జరగనుంది.


ఇంగ్లండ్ వన్డేజట్టు : సీవర్ బ్రంట్(కెప్టెన్), సోఫియా డంక్లే, ఎమ్మా లాంబ్, బ్యూమంట్, జోన్స్(వికెట్ కీపర్లు), క్రాస్, దేవిడ్‌సన్ రిచర్డ్స్, ఎకిల్‌స్టన్, లారెన్ ఫైలెర్, మియా బౌచియర్, క్యాప్సే, లిన్సే స్మిత్, లారెన్ బెల్.

సెమీస్‌కు సబలెంక, అనిసిమోవా

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్



సబలెంక



అనిసిమోవా

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక, అమెరికా సంచలనం అనిసిమోవా ప్రవేశించారు. మంగళవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సబలెంక మూడుసెట్ల హోరాహోరీ పోరులో జర్మనీకి చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి సెగ్మండ్‌ను చిత్తుచేయగా.. 13వ సీడ్, అనిసిమోవా వరుససెట్లలో రష్యాకు చెందిన పొయెంచికోవాను ఓడించారు. తొలి క్వార్టర్‌ఫైనల్లో సబలెంక 4-6, 6-2, 6-4తో సెగ్మండ్‌పై విజయం సాధించింది. తొలి సెట్‌లో 0-4తో వెనుకబడిన సబలెంక ఆ తర్వాత పుంజుకున్నా.. ఆ సెట్‌ను 6-4తో కోల్పోయింది. రెండో క్వార్టర్‌ఫైనల్లో అనిసిమోవా 6-1, 7-6(11-9)తో పొయెంచి కోవాను ఓడించింది. గురువారం జరిగే తొలి సెమీ ఫైనల్ సబలెంక-అనిసిమోవాల మధ్య జరగనుంది.

పురుషుల సింగిల్స్‌లో అల్కరాజ్, ఫ్రిట్జ్ కూడా..

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి అమెరికా సంచలనం టేలర్ ఫ్రిట్జ్, 2వ సీడ్ స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ ప్రవేశించారు. క్వార్టర్‌ఫైనల్లో 5వ సీడ్ ఫ్రిట్జ్ నాలుగుసెట్ల హోరాహోరీ పోరులో 17వ సీడ్, రష్యాకు చెందిన ఖచనోవ్‌పై విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో ఫ్రిట్జ్ 6-3, 6-4, 1-6, 7-6(7-4)తో ఖచనోవ్‌ను చిత్తుచేశాడు. ఇక అల్కరాజ్ 6-2, 6-3, 6-3తో అన్‌సీడెడ్, స్థానిక ఆటగాడు నొర్రిను ఓడించాడు. శుక్రవారం జరిగే సెమీస్‌లో అల్కరాజ్ ఫైనల్ బెర్త్‌కోసం ఫ్రిట్జ్‌తో తలపడనున్నాడు.



దక్షిణాఫ్రికా భారీ విజయం

- రెండోటెస్ట్‌లో జింబాబ్వేపై ఇన్నింగ్స్ 236 పరుగుల తేడాతో గెలుపు

బులవాయో: జింబాబ్వే పర్యటనలో ఉన్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్-2025 విజేత దక్షిణాఫ్రికా మరో భారీ విజయాన్ని నమోదు చేసింది. రెండో టెస్ట్‌లో జింబాబ్వేపై ఏకంగా ఇన్నింగ్స్ 236 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా జట్టు ఘన విజయం సాధించింది. మంగళవారం రెండో ఇన్నింగ్స్‌లో ఫాలో ఆన్ ఆడుతున్న జింబాబ్వేను 220పరుగులకు ఆలౌట్ చేసింది.దక్షిణాఫ్రికా బౌలర్లు బోస్ట్‌కు నాలుగు, ముత్తుసామికి మూడు, యూసుఫ్‌కు రెండు వికెట్లు దక్కాయి. జింబాబ్వే జట్టులో వెల్చ్(55) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ ఎర్విన్(49), ఓపెనర్ కైటానో(40) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను దక్షిణాఫ్రికా జట్టు 2-0తో చేజిక్కించుకొని క్లీన్‌స్వీప్ చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ ముల్డర్‌కు దక్కింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68